ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
మంగళవారం 18, మార్చి 2025 | 16 పేజీలు

**ముగ్గురు... మంత్రులున్న ప్రాజెక్టుకు నిధులు తీసుకురా పోవడం సిగ్గుచేటు**



8లో.. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

**ఆంధ్ర ఇసుకకు**
**తెలంగాణలో కాసుల వర్షం**

**తెగిస్తే లక్షాధికారి ...**
**దొరికితే జరిమానాతో సరి**

**రాత్రి దోచుకోవడం ..**
**పగలు పంచడం**

**ముఖ్యమంత్రి ఆదేశాలు**
**తెలంగాణకే ... ఆంధ్రా**
**నుంచి వచ్చే వాటికి**
**కాదంటున్న అధికారులు ?**

**ఇసుక మాఫియాకు**
**దాసోహంగా మారిన**
**అధికార యంత్రాంగం ?**

2లో..



# సరిహద్దుల్లో అవినీతి బాగోతాలు

భద్రాచలం, ప్రభాతవార్త : భద్రాచలం చుట్టూ గోదావరి నదిలో అత్యంత నాణ్యత కలిగిన ఇసుక కలిగి ఉండి పేదవాడి సొంతింటి నిర్మాణానికి పిరికెడు ఇసుక ఉపయోగించుకోవడానికి అవకాశం లేకుండా అన్ని ఉన్నా ... అల్లుడి నోట్లో శని అన్నట్లుగా చట్టాలు తయారు అయ్యాయి. అనేక పర్యాయాలు, ఎమ్మెల్యేలు, స్వయాన జిల్లా కలెక్టర్ మన ఊరు - మన ఇసుక అనే పథకాన్ని ప్రారంభించి భద్రాద్రి వాసులకు నిర్మాణాలకు ఇసుకను అందుబాటులోకి తెస్తామనే వాగ్దానాలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. దీనితో అత్యంత వేగంగా నిర్మాణరంగంలో అభివృద్ధి చెందుతున్న భద్రాచలంకు ఇసుక అనివార్యమైనది. ఇంటి నిర్మాణం కొరకు, అభివృద్ధి పనుల కొరకు సమీపంలో ఇసుక సేకరణకు అవకాశం లేక వక్రమార్గంలో వేలాది రూపాయలు ఖర్చు పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

2లో..

రాష్ట్రాన్ని విడదీసి తప్పు చేశారు

డ్యాం పునరుద్ధరణ బాధ్యత కేంద్రం తీసుకోవాలి

వెంగళరావు కృషితో వేలాది కుటుంబాలకు అన్నం

ప్రాజెక్ట్ విధ్వంసంలో ఇరిగేషన్ నిర్లక్ష్యం కూడా ఉంది

గిరిజన కమీసన్ సభలో మాజీ మంత్రి జలగం

దద్దరిల్లిన పెదవాగు ప్రాంగణం



సభలో మాట్లాడుతున్న జలగం

## పెదవాగు కోసం చంద్రబాబుని కలుస్తా

అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్ , ప్రభాతవార్త :

దివంగత ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కట్టించిన పెదవాగు ప్రాజెక్ట్ ని ఈరోజు ఈలాటి శిధిలావస్థలో చూడటం చాలా బాధగా ఉన్నదని మాజీ మంత్రి జలగం.ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఎస్టి కమీషన్ సభ్యులు జతోతు హుస్సేన్ నాయక్., ఈ డ్యాం పరిశీలించిన అనంతరం జరిగిన గిరిజన సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు దీనిద్వారా ఆకలి తీరిందని, ప్రస్తుత తెలంగాణా భూభాగంలో కేవలం 2000 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండగా.. ఆంధ్రా భూభాగంలోని కుక్కునూరు వేలేరుపాడు మండలాల పరిధిలో..

8లో..



## పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రంగం సిద్ధం..

సత్తుపల్లి మార్చ్ 17 ప్రభాత వార్త :

సత్తుపల్లి నియోజకవర్గం ఏం సూరు మండలం కల్లూరు గూడెం గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనూతనంగా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించ డానికి ఆయిల్ పేడ్ రంగం సిద్ధం చేస్తుంది. కల్లూరు గూడెం గ్రామంలో 42 ఎకరాలు విస్తీర్ణంలో నూతన ఫ్యాక్టరీ నిర్మించి టానికి ఇప్పటికేస్థలాన్ని సేకరించి చుట్టూ ఫెన్సింగ్ వేసి నీటి కోసం బోర్లు వేయడం జరిగింది.

**రూ 80 కోట్లకు టెండర్ల ఆహ్వానం:**

రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి తో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ సహా కారంతో కల్లూరు గూడెం గ్రామంలో నూతనంగా ఫ్యాక్టరీ నిర్మించడానికి రూ 80 కోట్ల రూపాయలతో..

రూ 80 కోట్లు టెండర్ల ఆహ్వానించిన ఆయిల్ పేడ్
42 ఎకరాల్లో కల్లూరు గూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ

# సరిహద్దుల్లో అవినీతి బాగోతాలు

(మొదటి పేజీ తరువాయి..)

దీనిని ఆసరాగా చేసుకున్న ఇసుక మాఫియా సిండికేట్‌గా ఏర్పడి పట్టణంలోని అధికారులను సామ ధాన దండోపాయాలతో లోబర్చుకుని భద్రాచలం సరిహద్దు ప్రాంతమైన గుండాల నుంచి నిత్యం చీకటి పడినప్పటి నుంచి తెల్లవార్లు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి ముంపు మండలాల్లో ఒకటైన ఎటపాకం మండలం అధికారుల నుంచి పూర్తి సహకారం లభిస్తుందంటే అతిశయోక్తి కాదు.

**ఆంధ్ర ఇసుకకు తెలంగాణలో కాసుల వర్షం**

భద్రాచలం సరిహద్దు ప్రాంతం గుండాల గ్రామం గోదావరి పరివాహకంలో లభించే ఇసుకకు ఇటు తెలంగాణ, అటు ఆంధ్ర రాష్ట్రాల్లో అత్యధిక డిమాండ్ కలదు. ఇట్టి ఇసుకను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక మాఫియా రాత్రి సమయాల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా భద్రాచలం సరిహద్దు ప్రాంతాల్లో డంప్‌యార్డులకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి భద్రాచలంలో అవసరమైన గృహ నిర్మాణ దారులకు ఒక ట్రాక్టర్ ఒక ఇంటికి రూ.4వేల నుంచి రూ.5వేల వరకు తీసుకుని తరలిస్తున్నారు. అంతేకాకుండా ఈ డంప్‌యార్డుల నుంచి లారీలకు కూడా లోడింగ్ చేసి ఖమ్మం, హైద్రాబాద్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ విధంగా ఆంధ్ర ప్రాంతం నుంచి తీసుకువచ్చిన ఇసుకకు అధిక మొత్తంలో తెలంగాణ ప్రాంతంలో కాసుల వర్షం కురిపిస్తుంది.

**రాత్రి దోచుకోవడం .. పగలు పంచడం**

భద్రాచలం సరిహద్దు ఆంధ్ర ప్రాంతం నుంచి తరలించే ఇసుకను భద్రాచలంలోకి కూనవరం రూట్ మీదుగా, రాజుపేట మీదుగా, పురుషోత్తపట్నం మొదలగు రూట్ల నుంచి ఇసుకను తరలిస్తూ సుమారు భద్రాచలంలో 8 చోట్ల డంప్‌యార్డులు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇసుక మాఫియా పట్టణంలోని వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఏజెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ తదనుగుణంగా రూట్లు మార్చుకుంటూ యధేచ్ఛగా ఇసుక అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ విధంగా రాత్రి అయితే దోచుకోవడం ... దోచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని పగలు అధికారులకు పంచడం పరిపాటిగా మారిందని, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎప్పుడైనా కర్మకాలి ప్రజల ఒత్తిడి మేరకు, మీడియా ఆధారాల మేరకో లేక పై అధికారుల ఒత్తిడి వల్లనో అడపా దడపా 1 లేదా 2 వాహనాలను పట్టుకుంటే వాటిపై నామమాత్రపు పెనాల్టీ విధించి మరుసటి రోజే విడిపెడుతున్న సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. దీనితో ఇసుక మాఫియాకు దోచుకుంటే దోచుకున్నంత ... దొరికితే గోరంత జరిమానాతో సరిపెట్టుకోవచ్చునని బరితెగించి ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టణంలో ఒక ఐఏఎస్, ఒక ఐపీఎస్ ఉన్నతాధికారులు ఉన్నప్పటికి మీడియా పరంగా అనేక ఆధారాలతో బహిర్గతం చేస్తున్నప్పటికి కఠినమైన నిర్ణయాలు తీసుకోకవడం పట్ల కింద స్థాయి అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు రేకెత్తిస్తున్నాయి. స్వయాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇసుక మాఫియాకు అడ్డాగా మారిందని, ఎంతటి వారినైనా ఉక్కుపాదంతో తొక్కేయాలని, అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని, ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా ఇక్కడి అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయం. ఏది ఏమైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఈ అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా భద్రాచలం పట్టణ ప్రజలకు నిబంధనలకు అనుగుణంగా మన ఊరు మన ఇసుక పథకాన్ని అమలు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# పెదవాగు కోసం చంద్రబాబుని కలుస్తా

(మొదటి పేజీ తరువాయి..)

18000 ఎకరాలు సాగయ్యేదని గుర్తు చేశారు. అంతటి ప్రాధాన్యత గల నిర్మాణం ఈరోజు నేలమట్టమైందని నొచ్చుకున్నారు. ఈరోజున దీన్ని తిరిగి దార్లో పెట్టాలంటే రూ.80కోట్లకు పైగా నిధులు కావాలని, 85శాతం షేర్ ఏపి ప్రభుత్వం ఇవ్వాల్సివచ్చినందున సాంకేతికంగా విఘ్నాలు ఎదురవుతున్నాయని జలగం పునరుద్ఘాటించారు. అందుకని అవసరమైతే తాను అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబుని కూడా కలిసి విజ్ఞప్తి చేస్తానని గిరిజనుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రాష్ట్ర విడిపోవడం వల్ల మనకు ఇలాంటి అవాంతరాలు ఎన్నో ఎదురవుతున్నాయని, ఇరిగేషన్ కి మన రాష్ట్రంలో అసలు బడ్జెట్ లేకుండా చేయడం శోచనీయమన్నారు. ఓ సారియితే (ఉమ్మడి ఏపి) తెలుగుదేశం అధికారంలో ఉండగా కూడా ఓమూల కట్ట తెగితే ఆరోజు జలగం వెంగళరావు స్వయంగా దృష్టిసారించి నెల తిరక్కముందు పరిస్థితి చక్కదిద్ది రైతులకు యదావిధిగా సాగునీరందించిన విషయం ఇక్కడివారందరికీ తెలుసునని ఆయన గుర్తు చేశారు. ప్రాజెక్టుని తిరిగి పూర్వపు స్థాయిలో నిలబెట్టాలంటే కోటి రెండు కోట్లతో అయ్యే పనికానందున, తాను భారతీయ జనతాపార్టీ పెద్దలను, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతస్థాయి అధికారులందరినీ సమన్వయ పరిచేందుకు పాటుపడతానని ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నిర్వహణకు నీటిపారుదల శాఖలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం బాధాకరమని, జనరేటర్లు కూడా అత్యయిక స్థితిలో పనిచేయడంలేదని, ప్రభుత్వానికి చీమైనా కుట్టినట్లు లేదని ఎద్దేవా చేశారు. గత ఏడాది జూలై 18 న సంభవించిన వరదల సమయంలో మోటారు కాలిపోయి గేట్లు లేవలేదని, 8 నెల్లయినా పరిస్థితి దారిలో పడలేదని, ఎలాగూ రాబోయే వ్యవసాయ సీజన్‌కి కూడా ఈ డ్యాం నుంచి సాగునీరందదని, రైతులంతా అయోమయంలో పడ్డారని, వేలాది కుటుంబాలకు అన్నంపెట్టిన వీరి రుణం ఏమిస్తే మాత్రం తీరుతుందని ప్రశ్నించారు. "ఎప్పుడు మంజూరు చేస్తారు ? ఎప్పుడు నిర్మాణం పూర్తవుతుంది ? ఎప్పుడు నీటిని అందిస్తారు ? ఏమో ఇదంతా చాలా గందరగోళంగా ఉన్నది" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అన్నీ అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగి పనులు మొదలైనా కనీసం రెండేళ్ళ కాలం పడుతుందన్నారు. మరి అప్పటిదాకా ఆయకట్టుదార్ల పరిస్థితి ఏమిటో తెలియడంలేదని, అందుకనే తాను జాతీయ ఎస్‌టి కమీషన్ సభ్యులు నాయక్ ని పలు మార్లు కలిసి, గిరిజన రైతుల గోడు వినిపించగా, ఆయన కదిలారని, వారి స్థాయిలో కృషి చేసి ఎలాగైనా నిధులు సమకూర్చేలా



సభకు హాజరైన గిరిజన రైతులు

శ్రమించాలని కోరుతూ, తన మాట మన్నించి ఈ సభకు వచ్చిన వేలాది మంది గిరిజన గిరిజనేతర రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జాతీయ కమీషన్ సభ్యులు నాయక్ మాట్లాడుతూ.,పరిస్థితిని తాను కళ్ళారా చూశానని, తాను ఏదోవిధంగా తన స్థాయిలో ప్రయత్నించి, అవసరమైన నిధులు తెస్తానని అన్నారు. గిరిజనోద్ధరణ కోసం తనమీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని, జలగం ప్రసాదరావు తనను ఈ విషయంలో నిద్రపోనివ్వడంలేదని అన్నారు. అవసరమైతే ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కదిలించి, ఢిల్లీకి పిలిపించి పెదవాగు ప్రాజెక్ట్ పునరుద్ధరణకు అవసరమైన నిధులు సాధిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఒకేసారి లక్ష క్యూసెక్కుల వరద ప్రాజెక్ట్‌ని ధ్వంసం చేసిందని, అందువల్ల కంగారు పడకుండా డ్యాం పునరుద్ధరణ విషయంలో సాంకేతికంగా ఆచితూచి అడుగులు వేయాలని, హరీబురీగా నిర్ణయాలు తీసుకునే సందర్భం కాదని, కట్టడం శాశ్వతంగా ఉండేలా ప్రయత్నించాలని సూచించారు. అందుకోసం తాము పూర్తిగా సహకరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా షేర్ కోసం తాము లేఖలు రాసినా వాళ్ళు స్పందించలేదనే విషయాన్ని బయటపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఒ రాహుల్, ఇతర ఉన్నతాధికారులు సీనియర్ నాయకులు కోటగిరి సీతారామస్వామి, జూపల్లి రమేష్, పుట్టా సత్యం, నిర్మల పుల్లారావు, చెన్నారెడ్డి, తుమ్మా రాంబాబు, వేలాదిమంది గిరిజన గిరిజనేతర రైతులు పాల్గొన్నారు. జై జలగం నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లింది. మోదుగపూలు, విప్పపువ్వు, ఇత్యాది అటవీ ఫలాలతో గిరిజన మహిళలు ఉన్నతస్థాయి బృందానికి స్వాగతం పలికారు.

# పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రంగం సిద్ధం...

(మొదటి పేజీ తరువాయి..)

మెకానికల్, సివిల్,పనులకు ఆయిల్ ఫెడ్ టెండర్ల ఆహ్వానించడం జరిగింది.రూ62 కోట్ల రూపాయల తో మెకానికల్ వర్క్స్ కి రూ 18 కోట్ల రూపాయలు సివిల్ పనులకు టెండర్లు పిలవడం జరిగింది. నిర్మించే ఫ్యాక్టరీ స్థలం వద్దకు రహదారి సౌకర్యం కూడా ఇటీవల రైతులు దగ్గర ఆరు ఎకరాలు తీసుకొని వారికి నష్టపరిహారం కూడా చెల్లించడం జరిగింది. ఫ్యాక్టరీ వరకు కిలోమీటర్ నర డబల్ రోడ్డు నిర్మించే పనులు ఆయిల్ ఫెడ్ అధికారులు నిమగ్నమయ్యారు. ఉగాది నాటికి ఈ ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సత్తుపల్లి లో ఇటీవల ప్రకటించడం జరిగింది. మంత్రి తుమ్మల సూచనలు మేరకు ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణానికి పనులను వేగవంతం చేశారు.

**ఖమ్మం జిల్లాలో ఇది తొలి ఫ్యాక్టరీ కానుంది :**

వరి పంటలకు బదులు వాణిజ్య పంటలైన పామాయిల్ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం రైతులని ప్రోత్సహిస్తున్న దృష్ట్యా రైతులకు మరింత అందుబాటులో ఉండేందుకు పామాయిల్ ఫ్యాక్టరీని కల్లూరు గూడెం గ్రామంలో నూతనంగా ఫ్యాక్టరీని నిర్మించి తలపెట్టారు. ఇక్కడ నిర్మించే ఈ ఫ్యాక్టరీ ఖమ్మం జిల్లాలోని తొలి ఫ్యాక్టరీ కానుంది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో పామాయిల్ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇక్కడ నిర్మించే ఈ ఫ్యాక్టరీ తొలిత గంటకు 15 టన్నులు కెపాసిటీతో ప్రారంభం నుండి క్రమేపి గంటకో 60 టన్నుల కెపాసిటీ విస్తరించనుంది. ఇప్పటివరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గంటకు 60 టన్నులు అప్పారావుపేట ఫ్యాక్టరీలో గంటకు 30 టన్నుల కెపాసిటీతో కొనసాగుతున్నాయి. తెలుగు సంవత్సరాది ఉగాది నాడు ఖమ్మం జిల్లాలో నూతనంగా పామాయిల్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించడానికి ఆయిల్ ఫెడ్ అధికారులు చక చక పనులు కొనసాగిస్తున్నారు.

# బిజెపి జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరి కోటేశ్వరరావు ఎన్నిక

ఖమ్మం మార్చి 17, ప్రభాత వార్త:



ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులుగా నెల్లూరి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. బిజెపి అధిష్టానం జిల్లా పార్టీ అధ్యక్షునిగా కోటేశ్వరరావును ఎంపిక చేస్తూ నిర్ణయం సోమవారం ప్రకటించింది. అనేకమంది ఆశావాహులు జిల్లా అధ్యక్షునికోసం పోటీ పడినప్పటికీ అధిష్టానం మాత్రం కోటేశ్వరరావు పేరును తెరపైకి తీసుకురావడంతో కమలం శ్రేణుల్లో చర్చ మొదలైంది. ఇంతకాలం పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన వాటిని పక్కనపెట్టి కొత్త చర్చకు తావిచ్చే రీతిలో కోటేశ్వరరావు తెరపైకి తీసుకురావడం జిల్లాలో చర్చి అంశంగా మారింది.

# పలు సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం

తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త

మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న పరిశుభ్రత, దోమల నివారణ, వీధి లైట్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణం తదితర సమస్యలపై స్థానిక తహశీల్దార్‌కు సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో తల్లాడ బిజెపి మండల అధ్యక్షుడు వల్లా నాగులు ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంగీతం సాయిచంద్, చౌడా నాగేశ్వరరావు, వాడవల్లి నాగేశ్వరరావు, బెల్లంకొండ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది బాల పురస్కారం అందుకున్న లిఖిత సాయిశ్రీ

తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త

భరత నాట్యంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, లీలావతి మనుమరాలు చిన్నారి లిఖిత సాయిశ్రీ ఉత్తమ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో శ్రీ విశ్వావాసు నామ సంవత్సరం సందర్భంగా ఉగాది బాల పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చిన్నారి లిఖిత సాయిశ్రీ భరతనాట్యంలో అత్యంత ప్రతిభ కనబరచి అవార్డును సొంతం చేసుకుంది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా ఉగాది బాల పురస్కార్ అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భరతనాట్య గురువు కనతాల ఫణి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ జలాలు అందించి పంటలను కాపాడాలి

తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త

సాగర్ జలాలు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్‌పి డిఈకి వినతిపత్రం అందజేశారు. వారాబంధి లేకుండా కంటిన్యూగా నీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, భవాని, పులి వెంకట నర్సయ్య, ఎం. కృష్ణయ్య, ఎస్. వెంకట నరసయ్య, పులి నాగేశ్వరరావు, కె. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి గేదెల డైరీ ఫామ్‌పై రౌడీలతో దాడి

**- సీసీ కెమెరాలు ధ్వంసం..**

**- దాడికి అండగా మండలంలో లక్షల్లో చేతులు మారినట్లు బహిరంగ ఆరోపణలు**

చంద్రుగొండ ప్రభాతవార్త:

చంద్రుగొండ మండలంలోని ఆదివారం అర్ధరాత్రి గేదెల డైరీ ఫామ్ పై రౌడీలతో దాడి చేసిన ఘటన సోమవారం తెలుగులోనికి వచ్చింది వివరాల్లోనికి వెళ్తే చంద్రుగొండ మండల కేంద్రంలోని ఇమ్మడి రామయ్య బంజర గ్రామానికి ఆనుకొని గత సంవత్సరమున్నర నుండి దామరచర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గేదెల ఫామ్ నడుపుకుంటున్నాడు ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ ఆదివారం అర్ధరాత్రి చంద్రుగొండ గ్రామపంచాయతీ ఇమ్మడి రామయ్య బంజర్ ఆనుకొని ఉన్న గేదెల డైరీ ఫామ్ పై 18 లారీలు. 10 డీసీఎంలు 10 కారులలో సుమారు 70 నుంచి 100 మందికి పైగా రౌడీ మూకలతో వచ్చి ఫామ్ పై దాడి చేసి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి అక్కడే ఉన్న గేదెల కాపర్లపై దాడులు చేసి మొబైల్ ఫోన్లు లాక్కొని గేదెలు లారీలలో ఎక్కించుకునే అందుకు ప్రయత్నించగా 100కు 20 సార్లకు పైగా డయల్ చేసిన చంద్రుగొండ పోలీసులు స్పందించకపోవడంతో ప్రక్క మండలం వారు స్పందించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని. ఘర్షణ వాతావరణం చూడగా పోలీసులు అవాక్కైనారు తేరుకొని దాడులు చెయ్యి పోతున్న వారిని అరికట్టి అక్కడున్న వెహికల్స్ ని బయటికి పంపించి కొందరిని అదుపులోనికి తీసుకున్నారు ఫామ్ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సెలవులో ఉండడంతో సీఐ ఈ కేసును పర్యవేక్షిస్తున్నట్లు ఎస్సై తెలిపారు ..ఇంత ధైర్యంగా లారీలు తీసుకుని సుమారు 70 నుంచి 100 మందికి పైగా జనాలతో చంద్రుగొండలో అర్ధరాత్రి దాడికి తెగబడ్డారు అంటే వారికి ఎంత నెట్వర్క్ ఉందో చెప్పనక్కరం లేదు మండలంలో ఏమి జరిగినా ఎక్కడి వారు అక్కడే గప్ చుప్ అన్నట్లుగా అధికారులను నాయకులతోపాటు అందరిని లక్షల రూపాయల తో . ముందుగానే ముట్ట జెప్పినట్లు మండల కేంద్రంలోని బహిరంగంగా పలువురు చర్చించుకుంటున్నారు చూడాలా.. మరి పోలీసులు ఏం మాత్రం వారిపై చర్యలు తీసుకుంటారో... లేక వారికి సైతం మియామీయాలు ముట్ట చెప్పితే ఆ ఫైల్ మూసేస్తార లేదా అనేది వేసి చూడాల మరి ?



**- అర్ధరాత్రి గేదెల డైరీ ఫామ్‌పై దాడి చేశారు**

**- బాధిత కుటుంబ సభ్యుడు మునగాల వెంకటేశ్వర్లు**



మా బావ గేదెల డైరీ ఫామ్ పై ఆదివారం అర్ధరాత్రి సుమారు 70 నుంచి 100 మంది రౌడీలతో ఫాంపై దాడి చేసి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి గేదెలం తరలించే అందుకు లారీలను సిద్ధం చేసినారు ఎవరు మీరు ఎందుకు వచ్చారు ఎందుకు దాడులు చేస్తున్నారని ప్రశ్నిస్తే పట్టించుకోకుండా నీవు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో నన్ను ఎవరు ఏమి చేయలేరు నేను అధికారుల నుండి నాయకుల వరకు తోపాటు మరికొందరు అందరికీ లక్షలలో ముట్టజెప్పిన నాకు అండగా వారే ఉన్నారు అంటూ భయాందోళన వాతావరణం సృష్టించారని తెలిపారు కనీసం 100 కి డయల్ చేసిన. లేటుగా స్పందించారని తెలిపారు దాడులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినారు ఇది ఇలా ఉండగా ప్రభాతవార్త క్షుణ్ణంగా అధ్యయనం చేయగా ఫామ్ విషయం లో దాడి చేసే అందుకు వచ్చిన వారికి ఫామ్ బాధితులకు ఆర్థిక లావాదేవులు ఉన్నట్లు సమాచారం లావాదేవులుంటే చట్టపరంగా వసూలు చేసుకోవాలి కానీ ఇలా అర్ధరాత్రి దాడి చేయడం సరికాదని మండలంలోని కొందరు అభిప్రాయపడుతున్నారు





దాడి చేసేందుకు వచ్చిన వ్యక్తులు

# పోలీసులకు పట్టుబడ్డ చైన్‌స్నాచర్స్

**-చోరవ చూపిన సీఐ రమేష్, చేధించిన ఎస్సై రామకృష్ణ**

**-అభినందించిన ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్**

భద్రాచలంక్రైం ప్రభాతవార్త :



భద్రాచలంలో గత నెల ఫిబ్రవరి 19వ తేదీన ఇందిరా మార్కెట్ ఏరియాలో ఉన్న ప్రసాద్ కిరాణం షాప్ లో ఉన్న ఒక మహిళా మెడలో నుండి బంగారు నాను త్రాడు, నల్లపూసల గొలుసులను అపహరించిన నిందితులను పట్టుకోవడం జరిగిందని ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. పట్టణ సీఐ బీ.రమేష్, ఎస్సై బీ.రామకృష్ణలు అపహరణ జరిగిన నాడు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. రెండు బృందాలకు సీడీఆర్ సెక్షన్ లో ఉన్న నవీన్ అను అతను వారికి సహాయం చేశాడు. ఈ మేరకు పట్టణ ఎస్సై బీ.రామకృష్ణ పర్యవేక్షణలో సోమవారం మధ్యాహ్నం సమయంలో ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా భద్రాచలం రోడ్ వైపు నుండి సారపాక వైపుగా వస్తున్న ఒక మోటార్ సైకిల్ పై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారిని పోలీస్ వారు ఆపే ప్రయత్నం చేశారు. అట్టి మోటార్



సైకిల్‌ను ఆపకుండా పారిపోవుటకు ప్రయత్నించే క్రమంలో వెంబడించి వారిద్దరిని పట్టుకొని విచారణ చేపట్టగా వారు గతంలో చేసిన దొంగతనం చేసిన విషయాన్ని ఒప్పుకున్నారు. గతంలో ఇట్టి కేసులో ఏ2 ను ఈ నెల 11వ తేదీన అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. తరువాత వీరిద్దరి నుండి సోమవారం ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా ద్వారా రూ.2,35,000ల విలువ గల ఒక బంగారు నాను త్రాడు (64 గ్రాములు), ఒక నల్లపూసల గొలుసు (30 గ్రాములు)లను మరియు దొంగాతనానికి ఉపయోగించిన ఒక మోటార్ సైకిల్, ఒక మొబైల్ ఫోన్‌లను వారి వద్ద నుండి స్వాధీన పరుచుకుని సీజ్ చేసి, పట్టుబడిన ఇద్దరు మగ వ్యక్తులను అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం జైలుకు పంపనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా సదరు ముద్దాయిలను పట్టుకొనుటకు చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బీ.రమేష్, ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుల్స్ రామారావు, లక్ష్మణ్,సతీష్, హోంగార్డ్ తిరుపతిలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అభినందించారు.

## నేరాలు-దారుణాలు

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకున్న సిఐ మురళి

ప్రభాతవార్త ముదిగొండ:



మండల పరిధిలోని రాఘవాపురం శివారు యడవల్లి రోడ్డులో ఓ కాళీ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను సిఐ మురళి, సోమవారం రోజున పట్టుకున్నారు వివరాల్లోకి వెళితే రాఘవాపురం రోడ్డులో ముదిగొండ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నలుగురు యువకులు కాళీ ప్రదేశంలో అనుమానస్పదంగా తిరగటం చూసిన సి ఏ మురళి, వారిని తనిఖీ చేయగా వారి దగ్గర 25000 విలువ చేసే 500 గ్రాముల గంజాయి గుర్తించారు. వారి దగ్గర నుండి మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని వెంటనే ఈ నలుగురు యువకులను అరెస్టు చేసి విచారణ చేపడుతున్నారని సిఐ మురళి, తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై కృష్ణ ప్రసాద్, ట్రైన్ ఎస్ఐ హరిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మిర్చికి నిప్పంటించిన నిందితులు రిమాండ్

పినపాక ప్రభాతవార్త మార్చి 17:



మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పొనగంటి పురుషోత్తం కు చెందిన కల్లాలో అరబెట్టిన 50 క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తలగబెట్టిన విషయం తెలిసిందే. బాధిత రైతు పురుషోత్తం ఫిర్యాదు మేరకు ఇ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆదేశాల ప్రకారం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సై రాజకుమార్ కేసు దర్యాప్తును ముమ్మరం చేసి సాక్షాధారాల సేకరించిన అనంతరం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శ్రీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తాండ్ర బాలకృష్ణ వెంకటేశ్వర్లు,మంచర్ల వెంకటేశ్వర్లను మిర్చి తగలబెట్టిన నిందితులుగా గుర్తించామని తెలిపారు.వెంకటేశ్వరపురం గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నా క్రమంలో వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్ పై పారిపోతుండగా పట్టుకొని విచారిస్తే తాండ్ర బాలకృష్ణ అనే వ్యక్తి భార్య గత సంవత్సరం క్రింద చనిపోగా,పురుషోత్తం మంత్రాలు చేయడం వలనే తన భార్య చనిపోయిందని అతడు మనసులో కక్ష పెంచుకొని ఈ విషయాన్ని తన మామ వెంకటేశ్వర్లుకు చెప్పగా అతడు కూడా తనను పెద్దమనిషిగా ఎదగనీయకుండా పురుషోత్తమే అన్ని పంచాయతీలలో అడ్డుపడుతున్నాడని అతనిని ఎలాగైనా ఆర్థికంగా దెబ్బ తీయాలని ఇద్దరు అనుకొని సరైన సమయం కోసం వేచి చూసి 10వ తారీకు అర్ధరాత్రి సమయం లో మిరపకాయలకల్లాల వద్ద ఎవరు లేరని గమనించి పురుషోత్తంనికి సంబంధించిన 50 క్వింటాళ్ల మిర్చిని బాలకృష్ణ పెట్రోలు పోసి నిప్పంటించినాడన్నారు.అదేవిదంగా మరోవ్యక్తి వెంకటేశ్వర్లు రోడ్డుపై ఎవరూ రాకుండా కాపలాగా ఉన్నాడనీ, మిర్చి అంటుకున్న వెంటనే ఇద్దరు అక్కడి నుండి పారిపోయరని జరిగిన సంఘటన గురించి తెలిపారు.అదుపులోకి తీసుకోన్న నిందితులను పట్టుకొని రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు. కేసును త్వరగా చేదించిన ఏడుల్లబయ్యారం సి ఐ వెంకటేశ్వర్లు , ఎస్సై రాజుకుమార్ లను డి.ఎస్.పి రవీందర్ రెడ్డి అభినందించారు. సిబ్బంది లక్ష్మీనారాయణ, దిలీప్, శ్రీనివాస్,రాము, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

# కనీస వేతనాల గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి

*భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :*



జిల్లా కలెక్టర్ కనీస వేతనాలు గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించే వరకు నిరవధిక సమ్మె యథావిధిగా కొనసాగుతుందని, గిరిజన ఆశ్రమ పాఠశాల లు హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కార్యదర్శి బి.మధు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.బ్రహ్మాచారి, హీరాలాల్ స్పష్టం చేశారు. సోమవారం జీతాలు తగ్గించే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. సమ్మెకు ఆదివాసి కొండరెడ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ వారి సంఘం తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు మంగమ్మ రాధ పద్మ సంతోష్ రామారావు సలీం కుమారి రాములమ్మ కాంతమ్మ కనపరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడికి లోను కాకుండా ఇష్టపడి చదివితే విజయం మీదే

## -ఎంఈవో టీ. రమ

*భద్రాచలంటౌన్, మార్చి 17, ప్రభాతవార్త :*




భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 70 మంది విద్యార్థినిలకు పరీక్ష సామాగ్రిని ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ .. ఎప్పుడు అడిగినా కూడా ముందుకు వచ్చి పదవ తరగతి విద్యార్థినుల కోసం తమ వంతు సహకారం అందిస్తూ విద్యార్థులు చదువు కోసం ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు అభినందించారు. అలాగే ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల. మురళి మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ జీవితంలో 10వ తరగతి ఉత్తీర్ణత అతిముఖ్యమని, విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటిదని విద్యార్థులు చదివే క్రమంలో ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి ప్రణాళికతో చదివితే విజయం మీ సొంతం అవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి కూడా ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఒక లక్ష్య ఏర్పరచుకొని నిరంతరం ఆ లక్ష్యం కోసం ఇష్టంతో శ్రమిస్తే విజయం మీ సొంతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.రమా , ఉపాధ్యాయునిలు ఉపాధ్యాయులు ట్రస్ట్ సభ్యులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు కోమటిరెడ్డి చైతన్య , జిలకర నాగరాజు, బూరం .నవీన్ , బి .సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్‌లు పట్టివేత

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

దుమ్ముగూడెం మండలంలోని రేగుబల్లి గ్రామ శివారులో గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను దుమ్ముగూడెం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు తమ సిబ్బందితో కలిసి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకుని దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. పాత మారేడుబాక గ్రామానికి చెందిన గుండి చిట్టిబాబు, అలాగే పాతమారేడుబాక గ్రామానికి చెందిన కుర్సం కనకరాజు, తూరుబాక గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీను, అనే వ్యక్తులకు చెందిన ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకుని దుమ్ముగూడెం స్టేషన్‌కు తరలించగా ... ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులు లక్ష్యసాధన వైపు ప్రయాణం చేయాలి

## -సీఐ బరపాటి రమేష్

*భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :*



పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో 27 వ బ్యాచ్ అయిన పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐ బరపాటి రమేష్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ .. రేపటి భావి భారతంలో మీరు ఉన్నతమైన వ్యక్తిగా ఆదరణ గౌరవం పొందాలంటే విద్యార్థిగా ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి లక్ష్య సాధన వైపు ప్రయాణం చేయాలని సూచించారు. గత 33 సంవత్సరాలుగా నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా పలు రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులను అందిస్తున్న పాఠశాల యాజమాన్యం అయిన డాక్టర్ కే. అబ్రహం, డా. కే.రాధా మంజరిలను అభినందిందించారు. అనంతరం పట్టణ ఎస్సై విజయలక్ష్మి మాట్లాడుతూ .. నా విజయం నా హక్కు అనే ఆలోచన ప్రతి విద్యార్థి దృఢంగా పెంపొందించుకొని రాబోయే పరీక్షల్లో విజయం మాత్రమే లక్ష్యంగా సాధించాలని, ఎటువంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయరాదని విద్యార్థులకు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కే.రాధా మంజరి, ప్రిన్సిపల్ డాక్టర్ కే.అబ్రహం, పాఠశాల డైరెక్టర్లయిన ఎస్. రాజేష్, డా. అలీనా శాంతి పాల్గొన్నారు.



# హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

## -ద్విచక్రవాహనదారులకు దుమ్ముగూడెం పోలీసుల అవగాహన

## -గత నాలుగు రోజులుగా ద్విచక్రవాహనదారులకు అవగాహన దుమ్ముగూడెం సీఐ బీ.అశోక్

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

ద్విచక్రవాహనదారులు తమ వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని అనుకోని ప్రమాదాలు ఎదురైతే తమ ప్రాణాలను కాపాడుకోగలిగిన వారు అవుతారని దుమ్ముగూడెం సీఐ బీ.అశోక్‌బాబు ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. గత నాలుగు రోజులుగా దుమ్ముగూడెం మండలంలోని వివిధ గ్రామాల కూడళ్లల్లో ద్విచక్రవాహనాలను తనిఖీ చేస్తూ హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడుపుతున్న వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేనిచో చర్యలు చేపడతామని వారిని హెచ్చరించారు. ఇటీవల అవగాహన లేక హెల్మెట్ లేకపోవడంతో పలు ప్రమాదాల్లో ప్రజలు ద్విచక్రవాహనదారులు ప్రాణాలను కోల్పోతున్నారని, వాహనాలు నడిపే సమయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు.






# భద్రాద్రి దేవస్థాన ముఖ్య అర్చకుడు విష్ణుకు దక్కిన అరుదైన గౌరవం

*భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :*



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా విధులు నిర్వర్తిస్తున్న కోటి విష్ణువర్ధన్ ఆచార్యులకు అరుదైన గౌరవం లభించింది. మచిలీపట్నంలో జగద్గుర రామానుజాచార్య సంస్థానం నిర్వహణలో శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీనివాస శ్రీకర్‌స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిశేష పురస్కారోత్సవాల కార్యక్రమం నిర్వహించగా విష్ణువర్ధన్‌కు ఈ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలోని పలువురు అర్చకులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయి

## -మాజీ జెడ్పీటిసి బట్ట విజయ్ గాంధీ

*బూర్గంపహాడ్, మార్చి 18, ప్రభాతవార్త:*



క్రీడలు దేహదారుఢ్యం తో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయని మాజీ జెడ్పీటిసి బట్ట విజయ్ గాంధీ అన్నారు. బూర్గంపహాడ్ మండల ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో వేపలగడ్డ లో సోమవారం ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలోని నైపుణ్యాన్ని వెలికితీస్తాయని పేర్కొన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఖాళీ సమయాల్లో క్రీడల పై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ టోర్నీ కార్యక్రమంలో ఆదివాసీ మండల అధ్యక్షులు తాటి సత్యనారాయణ ,వేపలగడ్డ మాజీ సర్పంచ్ కుంజా చిన్నబ్బాయి, ఉప్పసాక మాజీ సర్పంచ్ పాయం వెంకటేశ్వర్లు, నకిరిపేట మాజీ సర్పంచ్ శర్పా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు తాటి వెంకటేశ్వర్లు ,కుంజా కృష్ణ, ఎడమ రామారావు, మాజీ వార్డు సభ్యులు కుంజా రాంబాబు, మేనేజ్మెంట్ సభ్యులు మెండి భాస్కర్, దనసరి శ్రీను, బొర్రా వీర్రాజు, తాటి రామారావు, కాకా రవి, స్థానిక ఆదివాసీ యువత కుంజా ప్రవీణ్ కుమార్ ,బన్ను, షకీల్, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించేంతవరకు సమ్మెను కొనసాగిస్తాం.. సీఐటీయూ

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

జిల్లా కలెక్టర్ కనీస వేతనాలు గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించే వరకు నిరవధిక సమ్మెదావిధిగా కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల లు హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపిమాట్లాడారు. జీతాలు తగ్గించే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మెను ప్రారంభించారని, లక్మి నగరం బాలికలహాస్టల్ ఎదుట సమ్మెలో నిర్వహించారు. ఎస్ టి ఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాల బిల్లు పాస్ అయితేనే సమ్మె విరమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకృష్ణ, హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ సిబ్బంది ప్రథమ చికిత్స, ఫైర్ ఫైటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

**- ప్రారంభమైన 35వ బ్యాచ్ శిక్షణా తరగతులు**

**- పాల్గొన్న కార్పోరేట్ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్**

కొత్తగూడెం, మార్చి 17 – ప్రభాతవార్త:



వారం రోజులపాటు జరుగనున్న యస్ పిసి సెక్యూరిటీ సిబ్బంది 35 వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులను కొత్తగూడెం యస్ పి.సి. ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ... ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్ పి.సి. విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే బోధించడం జరుగుతుంది అని తెలిపారు. అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద సెక్యూరిటీ సిబ్బంది ఉంటారని, ఎవరైనా ఉద్యోగులు ప్రమాదానికి గురైనపుడు కాని, ఆకస్మిక వ్యాధులకు గురైనపుడు కాని, అతన్ని ఆసుపత్రికి తరలించేలోపు అతనికి ప్రథమ చికిత్సను అందించి అతని ప్రాణాలు కాపాడవచ్చునని, ఎండా కాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించడానికి ఎక్కువ అవకాశం ఉన్నందున ఎక్కడైనా అగ్ని ప్రమాదము సంభవించినపుడు ఇక్కడ నేర్చుకున్న శిక్షణ ద్వారా దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని, వాటిని ఆర్పివేయాలని, ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాల ద్వారా సేవ చేస్తూ, యస్ పిసి విభాగము ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా విధులు నిర్వర్తించాలని, సమాజములో ఎవరికైనా ప్రథమ చికిత్స అవసరమైనపుడు వారికి కూడా సేవలనందించి సమాజములో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ డి. నారాయణ రెడ్డి పాల్గొని వందనసమర్పణ చేశారు.

## నవమి సందర్భంగా గోటి తలంబ్రాలు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 17 – ప్రభాతవార్త:




రాములోరి కళ్యాణంకు కోటి గోటి తలంబ్రాలను భక్తులు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణంకు తెలగ రామవరంలోని శ్రీ రామమందిరం దగ్గర ఘనంగా కోటి గోటి తలంబ్రాలు వలిచే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నవమిలోగా భక్తులు వీటిని రామాలయంలో సమర్పించనున్నారు.

## నేటి నుంచే రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తుల స్వీకరణ

**-అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి**

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్**

బూర్గంపహాడ్ ,మార్చి 18 ,ప్రభాత వార్త:

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం నుంచి దరఖాస్తులను స్వీకరించనుందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ మహమూద్ ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాటగిరీ1 కింద రూ.లక్ష వరకు రుణం అందించి 80 శాతం రాయితీ ఇస్తుంది. క్యాటగిరీ2 కింద రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మంజూరు చేసి 70 శాతం రాయితీ కల్పిస్తుంది అని వివరించారు. క్యాటగిరీ3 కింద రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల లోపు రుణాలను అందజేసి 60 శాతం రాయితీ ఇవ్వనుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని మైనార్టీ యువత అర్హులైన వారందరూ వచ్చేనెల ఏప్రిల్ ఐదవ తారీకు వరకు దరఖాస్తు వెబ్సైట్: హెచ్‌టీటీపీఎస్://టీజీవోబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవి.ఇన్ చేసుకుని చేసుకొని మూడు లక్షల లోన్ తీసుకుని వారింట ఆనందాన్ని నింపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు కరీం పాషా, అహ్మద్, సర్దార్, సుభాని, మీరా, నసీర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



## టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార ప్యాకెట్లు పంపిణీ

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త:



భద్రాచలంలో క్షయ వ్యాధి నివారణ కేంద్రం నందు ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ నిధి నుంచి ఆర్థిక సహకారంతో పంపిణీ చేయబడిన న్యూట్రిషనల్ కిట్స్‌లను భద్రాచలం టిబి యూనిట్ మరియు మండలాలలోని మందులు వాడుతున్న క్షయ వ్యాధి రోగులకు సోమవారం నిత్యవసర సరుకులు ( బియ్యం, కందిపప్పు, నెలకు సరిపడా వేరు శనగలు ఆయిల్ ప్యాకెట్) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా.పావని రెడ్డి, ఎంవోటీసీ,ఎన్‌టీఈపీకీ, స్టాప్ మరియు వెంకటేశ్వర్లు ఏసీఎఫ్ కో.ఆర్డినేటర్, టీబీ అలెర్ట్ ఇండియా ఎన్‌జీవో పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో ఆశా సమస్యలపై ధర్నా

బూర్గంపహాడ్ ,మార్చి 18, ప్రభాత వార్త:

బూర్గంపహాడ్ మండలంలో సిఐటియు ఆధ్వర్యం లో ఆశా వర్కర్ల సమస్యలపై సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధ ర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ముజాహిద్ కు వినతి పత్రాన్ని సిఐటియు నా యకుల ఆధ్వర్యంలో అందజేశారు. అదేవిధంగా అంగన్వాడి వర్కర్స్ తో కలిసి సిఐటియు ఆధ్వ ర్యంలో సిడిపిఓ రేవతి కి సమస్యలతో కూడిన వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటి యు మండల కన్వీనర్ పాండవుల రామనాథం మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆశా వర్కర్లకు 18 వేల ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే 50 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ అయితే ఐదు లక్షలు ఇవ్వాలని ఆయన అన్నారు.ఆశాల జీతంలో సగం పింఛన్ గా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.అదే విధంగా 18 వ తేదిన జరిగే అంగన్వాడీ వర్కర్స్ ధర్నాను, కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. అంగన్వాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ నాయకులు రాయల వెంకటేశ్వర్లు సిపిఐ నాయకులు పేరాల శ్రీనివాస రావు, బిఆర్ఎస్ నాయకులు కొనకంచి శ్రీనివా సులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడి వర్కర్స్ అనసూర్య,జ్యోతి లీల, దేవామణి,ఆశా వర్కర్లు ఎం. బుచ్చమ్మ, ఈశ్వరా రా దేవి, పి చిట్టెమ్మ, వీకలావతి, ఎం.నాగమణి, బాయమ్మ, కృష్ణవేణి,ప్రమీల తదితరులు పాల్గొన్నారు.






**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

## సింగరేణిలో చోరీల నియంత్రణకు అందరూ కృషి చేయాలి

**- వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ**

కొత్తగూడెం, మార్చి 17 – ప్రభాతవార్త:



సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణకు సెక్యూరిటీ సిబ్బంది అందరూ కృషి చేయాలని, చోరీల నియంత్రణకు పాటుపడాలని జీఎం సెక్యూరిటీ చందా లక్ష్మీనారాయణ అన్నారు., సోమవారం హెడ్డాఫీస్ నుంచి అన్నీ ఏరియాల సెక్యూరిటీ అధికారులతో యస్అండ్‌పిసి పరిపాలన పరమైన అంశాలు, దొంగతనాల నివారణ, ఎండాకాలంలో సెక్యూరిటీ సిబ్బందికి కావలసిన సదుపాయాలు, ఏరియాలలో స్క్రాప్ తీసివేత, మ్యాన్ పవర్, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమములో ఎస్వో టూ జియం.(సెక్యూరిటీ) జె. వేణుమాధవ్, కార్పోరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారి యం. డి. జాకీర్ హుస్సేన్, అన్ని ఏరియాల సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి సూపర్‌బజార్‌ల అబివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలి

**- సమీక్షించిన జీఎం పర్సనల్ కవితా నాయుడు**

కొత్తగూడెం, మార్చి 17 – ప్రభాతవార్త:



సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం జీఎం పర్సనల్ (ఐ ఆర్, పీఎం అండ్ వెల్ఫేర్) కవితా నాయుడు ఆధ్వర్యంలో సింగరేణి సూపర్ బజారుపై సమీక్ష సమావేశం నిర్వహించినారు.ఈ సమావేశంలో సింగరేణి సూపర్ బజారును అభివృద్ధి పథంలో నడిపించడానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. అందులో భాగంగా డిజిటల్ పేమెంట్స్ పెంచడం అలాగే అందుబాటులో అన్ని రకాలై నప్రొవిజన్స్ అందుబాటులో ఉంచడం దీంతో పాటుగా ఉద్యోగులకు అవసరమైన అన్ని వస్తువులు అందుబాటులో ఉంచుతూ సేల్స్ పెంచాల్సిందిగా తగిన సూచనలు చేశారు. సింగరేణి సూపర్ బజార్ వారికి అన్ని విధాలుగా అవసరమైన సహాయ సహకారాలు యాజమాన్యం తరపున అందించబడుతుందని వారికి తెలియజేశారు. ఈ సమావేశంలో ఎండి సూపర్ బజార్ విలాస్ శ్రీనివాస్, కొత్తగూడెం డివిజనల్ మేనేజర్ సిహెచ్ అశోక్, గోదావరిఖని మరియు శ్రీరాంపూర్ డివిజనల్ మేనేజర్స్ నరేన్ చక్రవర్తి, పి రాజుగారు, మేనేజర్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ప్రసాద్‌లు ఈ సమావేశంలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ డివిజన్ గురించి తెలియపరిచినారు.

## ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**- జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు హుస్సేన్**

ములకలపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:



అధికారులు గిరిజనులకు సేవ చేయాలనే దృక్పదంతో ఈ జిల్లాలో పనిచేస్తున్నారని, గ్రామాలలో పనిచేసే గ్రామ సెక్రటరీ అధికారులకు-గ్రామ ప్రజలకు వారధిగా ఉండి వారి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం ములకలపల్లి మండలంలోని చంద్రుకుంటలో పోడు పట్టా రైతుల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పోడు పట్టా భూములలో బోర్లు వేయించుకున్న గిరిజన రైతులకు సంబంధించిన బోర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో నివశిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాల సంక్షేమానికి, వారి సమస్యలు పరిష్కరించడానికి ఎస్టీ కమీషన్ ఒక కోర్టు లాంటిదని ఏ సమస్యనైనా లిఖితపూర్వకంగా తెలిపితే తప్పనిసరిగా పరిష్కరిస్తామని అన్నారు. కొండరెడ్లకు ప్రవేశపెట్టే ప్రతీ పథకం 100శాతం సబ్సిడీతో లభిస్తుందని జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్నవి జిల్లా కలెక్టర్ పరిష్కరిస్తారని, ఐటిడిఏ పరిధిలో ఉన్నవి పిఓ పరిష్కరిస్తారని, మిగతావి నా దృష్టికి తీసుకొని వస్తారని తప్పనిసరిగా అన్ని సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తానని అన్నారు.



అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ అటవీ భూములకు సంబంధించిన పోడు పట్టాలు 70 వరకూ పెండింగ్‌లో ఉన్నాయని వాటిని డిఎల్‌సి సమావేశం ద్వారా పరిష్కారం చేస్తామని అన్నారు. పోడు పట్టాలకు సంబంధించి గిరిజనులు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన పనిలేదని గ్రామంలో ఒక జాబితా తయారు చేసి అందరికి పోడు పట్టాలు అందిస్తామని అన్నారు. గిరిజన కుటుంబాలు తాతల కాలంనాటి సాంస్కృతి, సాంప్రదాయాలు మరవకూడదని ప్రతీ ఒక్కరూ సబ్సిడీ ద్వారా అందించే రుణాలు లబ్దిపొంది తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విధంగా వ్యవసాయ చేసుకోవాలని ముఖ్యంగా ఇప్పపూలకు సంబంధించిన మొక్కలు విరివిగా వేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని, పామాయిల్, మునగ సాగు చేయాలని అన్నారు. ప్రతీ ఒక్కరికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందిస్తామని, ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా తమ పిల్లలను బాగా చదివించి వృద్ధిలోకి వచ్చేలా చూడాలని అన్నారు.

భద్రాచలం ఐటిడిఎ ఇఓ రాహుల్ మాట్లాడుతూ పోడుభూముల సమస్యలకు సంబంధించిన 60 మంది గిరిజన రైతులకు 218 ఎకరాల పోడు పట్టాలు అర్హులైన వారికి అందజేయాలని, పట్టాలు అందిన రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడితో వచ్చే పంటలు వేసుకోవాలని అందుకు కరెంట్, బోరు మోటర్‌లు విద్యుత్ కనెక్షన్‌లు తప్పనిసరిగా ఇప్పిస్తామని, పంటలు వేసే విధానంలో కూడా మార్పులు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జివిఆర్ ట్రస్ట్ చైర్మన్ జలగం ప్రసాదరావు, ఆర్‌డిఓ మధుసూధన్, డిఎఫ్ఓ కృష్ణగౌడ్, ఎస్సీ ఎంపిడిసిఎల్ మహేందర్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి మణెమ్మ, ఎఓ సున్నం రాంబాబు, తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఓ రేవతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

**- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నిరసన**

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పాలన ప్రజాపాలన కాదని, మాదిగ వ్యతిరేక పాలన అని, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పుల తిరుపతి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా దుమ్ముగూడెం గ్రామంలో ఆ సంఘం కార్యకర్తల నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## 10వ తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడనాడాలి

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



రానున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ధైర్యంగా ఉండి పరీక్షలకు హాజరు కావాలని, పరీక్షలంటే భయాన్ని విడనాడాలని, నర్సాపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం 9వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ... పరీక్షలంటే ఆందోళన చెందవద్దని, పరీక్షల్లో ప్రశాంతంగా పాల్గొంటే మంచి ఫలితాలు సాధించవచ్చునని ఆయన అన్నారు. 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు పరీక్షలు మంచిగా రాయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నర్సాపురం హైస్కూల్‌లో గతంలో పనిచేసిన పూర్వ ప్రధాన ఉపాధ్యాయుడు గోళ్ల వెంకటేశ్వర్లు, పాఠశాల అభివృద్ధి కోసం రూ.10వేలను పాఠశాలకు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రత్నకుమారి, పలువురు ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పథకాలు రద్దు చేయాలి

**- సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరసన దీక్ష**

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వాలు పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టనున్నాయని, అట్టి పథకాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.పద్మ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ములకపాడు గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్‌లు నిరసన దీక్ష చేపట్టారు. దీక్ష శిభిరాన్ని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మలు సందర్శించి మాట్లాడుతూ ... అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్‌వాడీలకు ఇస్తామన్న రూ.18వేలు ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి నెల 1వ తేదీన అంగన్‌వాడీలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి, కమలాదేవి, రమణా, గజలక్ష్మి, సావిత్రి, లలిత, బుచ్చమ్మ, జానకమ్మ, ఆదిలక్ష్మి, వ్యకాస జిల్లా నాయకుడు చంద్రయ్య, పలువురు అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ములకపాడులో దుకాణాలు తొలగింపు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



మండల పరిధిలోని ములకపాడు గ్రామం వద్ద ప్రధాన రహదారి పక్కనే ఉన్న రెండు దుకాణాలను దుమ్ముగూడెం రెవెన్యూ సిబ్బంది సోమవారం తొలగించారు. రోడ్డు పక్కన మోటార్ సైకిల్ సీటు కవర్లు అమ్ముకునే వ్యాపారస్తులు తరుచూ వివాదాలు పెట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలో వారిపై దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. దీంతో దుమ్ముగూడెం తహసిల్దార్ ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు, అట్టి దుకాణాలను తొలగించారు.




## మాదారం పాఠశాలను సందర్శించిన డిఇఓ



ములకలపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:

మండల పరిధిలోని మాదారం యుపిఎస్ ప్రభుత్వ పాఠశాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి, ప్లానింగ్ ఓఆర్డినేటర్ వి సతీష్ కుమార్‌లు సోమవారం సందర్శించారు. ఈ నేపథ్యంలో బాలికల కొరకు మంజూరి చేయబడిన టాయిలెట్ యొక్క పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల యొక్క విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్నభోజన వర్కర్‌లతో మాట్లాడి మెనూను పరిశీలించారు. అదే విధంగా మధ్యాహ్నభోజనంను రుచి చేశారు. ఈక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ జి సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం కె లత, స్కూల్ హెచ్‌ఎం టి వెంకటేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఆదివాసి నాయకుడు మృతి

ఆళ్లపల్లి మార్చి 17 ప్రభాతవార్త:



ఆదివాసి నాయకుడు కొమరం నర్సింహారావు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది వివరాల్లోకెళ్తే మండల కేంద్రంలో మర్కోడు గ్రామపంచాయతీ లో జిన్నెలగూడెం గ్రామానికి చెందిన కొమరం నర్సింహారావు 50 ఆదివాసి నాయకుడు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమైనదని టీపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు అన్నారు. ఎంతో ఆప్యాయంగా పలకరించి చిరునవ్వు లేదని ఊహ చాలా బాధ ఉందని వారి వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలియజేశారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు అశ్రు నయాల మధ్య అంత క్రియలునిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతు మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య మండల అధ్యక్షులు పాయం రామ నర్సయ్య ఆదివాసి మండల అధ్యక్షులు పాయం రమేష్ వివిధ పార్టీ నాయకులు మరియు ఉద్యోగులు మాజీ సర్పంచ్ శంకర్ బాబు బంధువులు స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నడిరోడ్డుపైనే కభేళా

**- రోగాల బారిన పడ్డ జీవాలను అమ్ముతున్న వైనం**

**- బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వెనకాల జీవాల వ్యర్థాలు**

**- జుగుప్సాకరంగా మారినా స్పందన లేని అధికారులు**

( మధిర ప్రభాతవార్త )



మధిర పట్టణంలో మాంసం విక్రయిదారులు చేస్తున్న నిర్వాకం సభ్య సమాజం ఆవేదన చెందేలా మారింది. మాంసం విక్రయించేందుకుగాను తీసుకొస్తున్న మేకలు గొర్రెలు కోళ్లను రోడ్డుపైనే హలాల్ చేస్తూ మాంసం విక్రయాలకు సిద్ధం చేస్తుండడంతో ఈ ప్రాంతం కభేళా ను తలపించేదిగా మారింది. మేకలను కోళ్లను కోస్తూ వాటి ద్వారా వచ్చే వ్యర్థాలను అక్కడే పడవేయడం, స్థానికంగా పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయం దానికి అనుకొని నిర్మాణం చేపట్టిన మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం పరిసరాల్లో వ్యర్థ పదార్థాలను వేస్తుండడంతో ఈ ప్రాంతం దుర్వాసనకు నిలువుగా మారడమే కాకుండా, ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి.

**- అనారోగ్య జీవాలతోనే వ్యాపారం**

మధిర పట్టణంలో మాంసం విక్రయాలు చేపడుతున్న కొంతమంది వ్యక్తులు కేవలం రోగాల బారిన పడిన జీవాలను తీసుకువచ్చి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారనేది బహిరంగ రహస్యంగా మారింది. అతి



తక్కువ ధరకు కొనుగోలు చేసుకువచ్చి ఇలాంటి జీవాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని, అనారోగ్యంతో ఉన్న జీవాల విక్రయించడం ద్వారా ప్రజలు కొనుగోలుదారులు రోగాల బారిన పడుతున్నారన్న ఆందోళన వ్యక్తం అవుతుంది. మున్సిపల్ యంత్రాంగం తమ పరిధిలో ఉన్న మాంసం విక్రయ దుకాణాలపై దృష్టి సారించాల్సిన బాధ్యతను విస్మరించి వ్యవహరించడం ఇందుకు పరాకాష్టగా మారింది.

**- బాబు జగ్జీవన్ రామ్‌కు అవమానం**

కబేళాన్ని తరిపిస్తున్న విక్రయ ప్రాంతం పక్కనే ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంతంలో జీవాల వ్యర్థాలను పడేస్తున్న తీరు దేశానికి మాజీ ప్రధానిగా సేవలందించిన ఓ మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం చుట్టూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నా పక్కనే ఉన్న మండల పరిషత్ అధికారులు కానీ పర్యవేక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ యంత్రంగానీ కనీసం స్పందించకపోవడం మహనీయులకు అధికారులు ఇస్తున్న గౌరవం ఇదేనా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. పలుమార్లు ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని రాజకీయ నాయకులు కూడా పేర్కొనడం అధికారుల బాధ్యత రాహిత్య విధి నిర్వహణ తీరుకు నిదర్శనం. ఇప్పటికైనా మున్సిపల్, పశుసంవర్ధక శాఖ అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించడంతోపాటు ఆరోగ్యమైన మాంసం విక్రయాలు ప్రజలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రైల్వే కాజ్ వే నిర్మాణంలో మార్పు చేయాలి

మధిర మార్చి 17 ప్రభాతవార్త:



మధిర పట్టణంలో లడక్ బజార్ ప్రాంతంలో ఉన్న రైల్వే కాజ్ వే (అండర్ బ్రిడ్జి) నిర్మాణంలో మార్పులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు రైల్వే అధికారులను కోరారు. స్థానిక వార్డు ప్రజలతో పాటు కాంగ్రెస్ నాయకులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేసిన నాయకులు కొత్తగా నిర్మాణం చేపడుతున్న మూడో లైన్ పనుల నేపథ్యంలో పాత మోరి కి అనుసంధానంగా కాకుండా మార్పులు చేసి చేపడుతున్న నిర్మాణాల వలన ఈ ప్రాంతంలోని ప్రజలకు వరదల సందర్భంగా ఇబ్బందులు తలెత్తే పరిస్తితులు ఉన్నాయని ఈ విషయాన్ని రైల్వే అధికారులు పరిగణలోకి తీసుకొని మార్పులు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కోరారు. ఈ మేరకు రైల్వే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు కిషోర్ తెలిపారు. మండల నాయకులు దారా బాలరాజు దుంప వెంకటేశ్వర రెడ్డి కోరంపల్లి చంటి షేక్ జహంగీర్ సంపసాల రామకృష్ణ, తలుపుల వెంకటేశ్వర్లు, బాహటం వనజ, వనపర్తి కళావతి, బాహటం శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

# రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కు రైతులంతా హాజరు కావాలి

**- కామేపల్లి ఏవో బి.తారా దేవి**

కామేపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:



కామేపల్లి రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి. తారా దేవి సోమవారం తెలిపారు. వేసవిలో మామిడి తోటల యాజమాన్యం పై రైతులకు రైతు నేస్తం పాట, వ్యవసాయ వీడియోలు, వేసవి సాగులో ఎంపికలు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించి చైతన్య పరుస్తారని తెలిపారు. శాస్త్రవేత్తలతో పరస్పర సంభాషణ, రైతుల సూచనలు, అభిప్రాయాలను కూడా స్వీకరించడం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులు, మామిడి రైతులు సకాలంలో పాల్గొని కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన పెంపొందించుకొని ప్రయోజనం పొందాలని ఆమె కోరారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకొని కాన్ఫరెన్స్ ను విజయవంతం చేయాలని తారా దేవి ఈ సందర్భంగా కోరారు.

# రైతుల సమస్యల పరిష్కారంలో ప్రజా పాలన ప్రభుత్వం వైఫల్యం

**- జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోండపర్తి గోవిందరావు**

కామేపల్లి, మార్చి17 ప్రభాతవార్త :




తెలంగాణ రాష్ట్రంలో రైతుల న్యాయమైన సమస్య లను పరిష్కరించడంలో ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఏఐకేఎస్ ) జిల్లా అధ్యక్షులు గోండపర్తి గోవిందరావు, జిల్లా నాయకులు ఎర్రబాబు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతా దేవి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు విమర్శించారు. కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామంలో సోమవారం సిరిపురం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఏఐకేఎస్ ) కామేపల్లి, కారేపల్లి మండలాల మహాసభలో వారు పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను పరిష్కరించటం లో విఫలం చెందారని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతు సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు పాస్ పుస్తకాలు అందించి రైతు భరోసా సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ మహాసభలో రైతు సంఘం నాయకులు బండి శీను, ప్రభాకర్, సత్యనారాయణ, పుచ్చకాయల కోటయ్య, వెంకటకృష్ణ, పుచ్చకాయల శ్రీను, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఏకగ్రీవంగా రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక: కాగా సభ అనంతరం కామేపల్లి, కారేపల్లి మండలాల రైతు సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కామేపల్లి మండల రైతు సంఘం అధ్యక్షులుగా మండల కేంద్రమైన కామేపల్లికి చెందిన బండి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల గూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల కోటయ్య ఎన్నికయ్యారు. కారేపల్లి మండల రైతు సంఘం అధ్యక్షులుగా బాగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా కారేపల్లి క్రాస్ రోడ్డుకు చెందిన పుచ్చకాయల శ్రీను ఎన్నిక కావడం జరిగింది. సంఘ అభివృద్ధికి, రైతాంగ సమస్యల పరిష్కారానికి రాజీ లేకుండా పోరాడుతామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయులు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను

**- చట్టసభలో ఉపాధ్యాయుల గళం వినిపిస్తా**

**- ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి**

మధిర మార్చి 17 ప్రభాతవార్త :



ఉపాధ్యాయులు తమ ప్రతినిధిగా తనను చట్టసభకు పంపారని వారు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా గెలిచిన అనంతరం తొలిసారిగా మధిర నియోజకవర్గానికి వచ్చినా ఆయన జమలాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధిరలోని టీవీఎం స్కూల్లో పిఆర్టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమానికి హాజరయ్యారు. యూనియన్ బాధ్యులు ఇతర ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై వారి గొంతుకనై చట్టసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తను ఏ పార్టీకి మద్దతుగా నిలవనని తనను గెలిపించిన ఉపాధ్యాయుల పక్షపాతి గానే తన పదవీకాలంలో బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహిస్తానని శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఎన్నికల్లో నన్ను ఆదరించి గెలిపించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే సి పీ ఎస్ రద్దు, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు, పెండింగ్ డీఏలు, పిఆర్సి గురుకుల ఉపాధ్యాయ సమస్యలు, కేజీబీవీ సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తానని ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు జిల్లా మాజీ అధ్యక్షులు మోత్కూరుమధు, మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మ రెడ్డి ,రాష్ట్ర బాధ్యులు పుట్లూరి.వెంకట రెడ్డి డి.వెంకటేశ్వరరావు, ఎస్కె.మదార్,గి.కృష్ణారెడ్డి మధిర మండల అధ్యక్ష,ప్రధాన,కార్యదర్శులు చిలుకూరిసత్యనారాయణ రెడ్డి,పోలె.సుధాకర్ జిల్లా బాధ్యులు సి హెచ్ వి రవికుమార్, కొమ్ము.శ్రీనివాసరావు బీవీఆర్, కోట.జయరాజు కొలగానిప్రసాదరావు,పిల్లినరసింహారావు, ఎల్.అప్పారావు, ఎండి.జమీర్, పిడిపి.జ్యోతి, టీ.అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలి

ముదిగొండ ప్రభాతవార్త:



వేసవి కాలంలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని రూరల్ డివిజనల్ అధికారి సిహెచ్ నాగేశ్వరరావు అన్నారు. ముదిగొండ లో ని సబ్ డివిజన్ సెక్షన్ల లను ఈయన తనిఖీ చేశారు. అదేవిధంగా విద్యుత్ శాఖ యొక్క పనితీరు సబ్ స్టేషన్, ఫీడర్ యొక్క పనితీరును పరిశీలించారు. వచ్చే వేసవికాలంలో విద్యుత్ సరఫరా లోఅంతరాయం లేకుండా చూసుకోవాలని తమ సిబ్బందినీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ ఏ. డి.ఈ. రామకృష్ణ, ముదిగొండ ఏఈ. శ్రీనివాస్, పమ్మి నారాయణ, మరియు విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు మంత్రులున్నా ప్రాజెక్టుకు నిధులు తీసుకురాకపోవడం సిగ్గుచేటు

**-జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్**
**-నెల రోజుల్లో పూర్తి ప్రతిపాదనలతో తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ**

**చండ్రుగొండ ప్రభాతవార్త :**

జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఉన్న వెంగళరావు ప్రాజెక్టుకు నిధులు తీసుకరాకపోవడం సిగ్గుచేటని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం సీతయ్య గూడెం దామరచర్ల గ్రామాల మధ్య లో వెంగల్ రావు ప్రాజెక్టును సోమవారం ఆయన సందర్శించినారు వచ్చిన హుస్సేన్ నాయక్ కి జిల్లా కలెక్టర్ పుష్ప గుచ్చమిచ్చి స్వాగతించి ప్రాజెక్ట్ అలుగు ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంగళరావు ప్రాజెక్ట్ అలుగు దంసమై ఆరు సంవత్సరాలు అయితే ఇంతవరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేక పోవడం విడ్డూరమని ఆయన అన్నారు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని ప్రస్తుత అధికారంలో ఉన్న ప్రభుత్వం అలాగే వ్యవహరిస్తుందని దొందు దొందే అని ఆయన యద్దవా చేశారు తెలంగాణ రాష్ట్రంలో గిరిజన ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గిరిజనులకు ఉపయోగపడే వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్ మరమ్మతులకు నిధులు ఇవ్వకపోవడం గిరిజన పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రులు అంతర్గత కుంపమ్ములాటలో కాలయాపన చేస్తున్నారని విమర్శించినారు వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్ పరిస్థితులపై పూర్తిస్థాయిలో నివేదికను తీసుకొని నెలలోపు ఢిల్లీ కి రావాలని హెచ్చరించినారు నిధులు మంజూరు చేయకపోతే ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఇరిగేషన్ అధికారులకు నోటీసులు ఇచ్చి ఢిల్లీకి రప్పిస్తామన్నారు గిరిజనులపై అధికారులు దాడులు చేస్తే సహించేది లేదన్నారు ప్రజలకు అధికారులు సేవలు మాత్రమే చేయాలి అలా కాదని వారిపై ఎటువంటి దాడులు చేసిన సహించేది లేదన్నారు త్వరలో హైదరాబాదులోనే జాతీయ ఎస్టీ కమిషన్ రీజినల్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు 72 శాఖలను సమీక్షించే అధికారం తమకు ఉందన్నారు ఈ సందర్భంగా మాజీ మంత్రి జలగం ప్రసాదరావు మాట్లాడుతూ వెంగల్ రావు సాగర్ ప్రాజెక్టు కింద ఎక్కువ మంది గిరిజనలు ఉన్నారన్నారు ప్రాజెక్ట్ పరిధిలో శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయి అన్నారు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోడు భూములు పట్టాలు పొందిన వారికి విద్యుత్ సౌకర్యం బోర్లు ఏర్పాటు విద్యుత్ అధికారులతో మాట్లాడి వారికి అనుమతులు కల్పిస్తామన్నారు కొత్తగా పోడు కొట్టకుండా అందరిపై బాధ్యత ఉన్నారు పామాయిల్ పై రైతులు దృష్టి సారించాలన్నారు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఆయిల్ ఫామ్ సాగి చేయాలన్నారు ఈ సందర్భంగా ఐబి ఎస్సి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తున్న అన్నారు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పనులు చేపట్టలేక పోయామన్నారు ఈ కార్యక్రమంలోని భద్రాచలం ఐటిడి పిఒ రాహుల్ ఐబి ఈఈ సురేష్ కుమార్ డి ఈ కృష్ణశంకర్ మండల ప్రత్యేక అధికారి సంజీవరావు తాసిల్దార్ సంధ్యారాణి ఎంపీడీవో అశోక్ సీఐ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# నేత్రానందపర్వంగా రామయ్య కళ్యాణం

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం నేత్రానందపర్వంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు కోటి రామస్వరూప్, అమరవాది మధులు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణీత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్చరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.

# మానవత్వాన్ని చాటుకున్న ఫైర్ మాన్ బండారి సతీష్

**భద్రాచలం అర్బన్, మార్చి 17, ప్రభాతవార్త :**

కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కొత్తగూడెం పట్టణానికి చెందిన మహి ళకే. జయలక్ష్మి తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ రక్త కణాల సంఖ్య పడిపోవడంతో వైద్యులు ఎమర్జెన్సీగా రక్తం ఎక్కించాలని సూచించారు. మహిళ యొక్క బ్లడ్ గ్రూప్ అరుదైన ఓ నెగిటివ్ కావడంతో బ్లడ్ దొరకక ఇబ్బంది పడుతున్న పరిస్థితి. మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి రావడంతో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా వెంటనే స్పందించి ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు కొత్తగూడెం ఫైర్ డిపార్ట్మెంట్ ఉద్యోగి ఫైర్ మాన్ బండారి సతీష్ ద్వారా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లోని బ్లడ్ బ్యాంక్ నందు అరుదైన ఓ నెగిటివ్ బ్లడ్‌ను 10 వ సారి రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను ఆదుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ ఎప్పుడు ఏ సమయంలోనైనా బ్లడ్ కావాలని అడిగిన వెంటనే నేనున్నానంటూ నేను ఇస్తానంటూ ముందుకు వచ్చి రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ట్రస్ట్ సభ్యులు ఫైర్ మాన్ బండారి సతీష్ అని అన్నారు. ఇలాంటి మంచి మనసున్న వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా అడగగానే స్పందించి ముందుకు వచ్చి రక్తదానం చేసిన రక్తదాతను వైద్యులు అభినందించారు.



# నేటి నుండి బ్రహ్మోత్సవాలు

**-ముస్తాబైన అభయాంజనేయ స్వామి ఆలయం**
**-హాజరుకానున్న ప్రముఖులు**

**వేంసూర్, మార్చి 17, ప్రభాత వార్త:**

వేంసూర్ మండలం లక్ష్మీనారాయణపురంలో వేం చేసియున్న శ్రీ సత్య అభయ ఆంజనేయస్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలుకు ముస్తాబయింది. ఆలయ వ్యవస్థాపకు లైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకులు టి భాస్కర శర్మ, టి కృష్ణమూర్తి శర్మలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళ బుధ వారాలు రెండు రోజులు పాటు స్వామి వారి సన్నిధిలో జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు శ్రీ సత్య అభయఆంజనేయ స్వామి ఆలయాన్ని రంగురంగుల వైభవంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల సందర్భంగా తొలిరోజు మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకం, మంగళ వాయిద్యాలతో మంగళ తోరణాలు, విగ్నేశ్వర పూజ, మండపారాధన, రాత్రి ఎనిమిది గంటలకు వల్లి దేవా సేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణము అనంతరం తీర్థప్రసాదాలు ఆలయ బాధ్యులు ఏర్పాటు చేశారు. రెండవ రోజు బుధవారం ఉదయం సుప్రభాత సేవ, స్వామివారికి అభిషేకం సహస్రనామార్చన 9 గంటలకు పూర్ణాహుతి ఉదయం 9:30 గంటలకు లక్ష్మినారాయణపురం గ్రామం భక్త బృందం సే హనుమాన్ చాలీసా పారాయణం పదిన్నర గంటలకు హనుమత్ కళ్యాణ మహోత్సవము అంగరంగ వైభవంగా జరుపుటకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకులు భాస్కర శర్మ రాధాకృష్ణ మూర్తి శర్మ లుతెలిపారు. అనంతరం భక్తులకు మహా అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాల కార్యక్రమాన్ని తిలకించటానికి స్వామివారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులకు, ప్రముఖులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ వ్యవస్థాపకులు భాస్కర శర్మ రాధాకృష్ణమూర్తి శర్మ లు ఏర్పాట్లు చేశారు.



# బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :**

దుమ్ముగూడెం తహసిల్దార్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సీనియర్ సహాయకుడు కాటా నర్సింహారావును దుమ్ముగూడెం తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన దుమ్ముగూడెం మండలంలో పనిచేసిన కాలంలో అందించిన సేవలను పలువురు సిబ్బంది కొనియాడారు. అలాగే దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, పలువురు నాయకులు నర్సింహారావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం తహసిల్దార్ మామిడి అశోక్‌కుమార్, గిర్దావర్లు కల్లూరి వెంకటేశ్వరరావు, నర్సింహారావు, పలువురు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**అదనపు కలెక్టర్‌లు డాక్టర్ శ్రీజ, శ్రీనివాస్ రెడ్డి**

*ఖమ్మం, మార్చి 17, ప్రభాత వార్త :*



అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లు సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లు ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ. ప్రజల అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదని, గ్రీవెన్స్ లో అందించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. కూసుమంచి మండలం పెరిక సింగారం గ్రామానికి చెందిన బి. ఆదెమ్మ గ్రామంలో సర్వే నెంబర్ 231 లో ఎకరం 3 గుంటల భూమి తన భర్త పేరు మీద ఉన్న భూమికి, తన ఆడపడుచు నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా పాసు బుక్కు తీసుకున్నారని, తమ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేయగా, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కల్లూరు మండలానికి చెందిన కే. సత్యవేణి బిఎస్సీ బి.ఎడ్ చేసానని తనకు కంప్యూటర్ ఆపరేటింగ్ వచ్చని, తనకు ఏదైనా ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం టేకులపల్లి కేసిఆర్ టవర్స్ కు చెందిన ఎస్.కే. హసీన బ్లాక్ నెంబర్ 30 ఎఫ్ 2 లో నివాసం ఉంటున్నానని, ఇంటిలో షాట్ సర్క్యూట్ జరిగిందని, ఇల్లు మొత్తం బూడిద అయిందని, తనకు పరిహారం అందించి సాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టులకు రేషన్ కార్డులు ఇవ్వాలని అదనపు కలెక్టర్ కు వినతి

*ఖమ్మం మార్చి 17, ప్రభాత వార్త:*



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆద్వర్యంలో రేషన్ కార్డులు లేని జిల్లా జర్నలిస్టులకు రేషన్ కార్డులు ఇవ్వాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి సోమవారంవినతి పత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా వార్తల సేకరణ అంశంలో విధుల్లో బిజీగా ఉంటూ తమ కుటుంబాన్ని కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోకుండా వార్తల సేకరణ లక్ష్యంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు రేషన్ కార్డులు లేకపోవడంతో బాధాకరమని, రేషన్ కార్డులు లేని వారందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా యూనియన్ నేతలు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కు చేతులు జోడించి నమస్కరించి వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వ సాగర్, కూరాకుల గోపి, జిల్లా ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సుభాన్, సివిఆర్ శ్రీను, రవి కిరణ్, యాకేష్, ఎస్.కె జానీ పాషా, కె.వి, మధులత, సీకే న్యూస్ ఉపేందర్, రవి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఐజల్ వాటర్ ప్లాట్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

*ఖమ్మం లీగల్ ప్రభాతవార్త*

న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐజల్ వాటర్ ప్లాంట్ ను సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ ప్రారంబించారు. వేసవి తాపన్ని ఏదుర్కొన్నందకు కక్షి దారులకు, న్యాయ శాఖ ఉధ్యోగల దాహర్తి ని తీర్చేందకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి హరికృష్ణ, కోర్టు ఉధ్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఈయాడాది 680 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు

**అదనపు కమిషనర్ నరేష్ కుమార్**

*క్రైమ్ ఖమ్మం మార్చి 17 ప్రభాతవార్త :*

ప్రస్తుత జీవనశైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయిందని జిల్లా అదరపు పోలీస్ కమిషనర్ ఏ నరేష్ కుమార్ అన్నారు, జిల్లాలో ఏడాది 680 మొబైల్ ఫోన్లు వినియోగదారులు పోగొట్టుకున్నారని వివరించారు, జిల్లాలో ఇప్పటివరకు 582 ట్రాక్కు చేదించి 290 ఫోన్లను రికవరీ చేసామని తెలిపారు, పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోగొట్టుకున్న ఫోన్లను వారికి అప్పగించారు, ఈ సందర్భంగా 45 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన అనంతరం మాట్లాడుతూ చోరీ పోగొట్టుకున్న వాటిని సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించడం జరిగింది అన్నారు, ఈయాడా ది ఈ విధానం ద్వారా సుమారు ఏడు లక్షలు విలువ చేసే ఫోన్లను ట్రేస్ చేసి నిజమే యజమానులకు అందించామన్నారు, ఒక్కో మొబైల్ ఫోన్ విలువ లక్ష యాభై వేల నుండి రూ పదివేల ఖరీదు చేసే ఫోన్లను సైతం ట్రాక్ చేసామని పేర్కొన్నారు, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న నాకు ఎవరు చేయాలి అన్న మొబైల్ ఫోన్లు మీదనే ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు, ఎక్కడైనా చోరీ కి గురైన పోగొట్టుకున్న పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమే అవుతుంది అని అలాంటి వాటిని పోలీసు యంత్రాంగం పొర రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు ఫోన్లో రికవరీలో కీలకంగా వ్యవహరించిన ఐటీసీ నోడల్ ఆఫీసర్ ఏసిపి ఎన్ వెంకటేష్ ఎస్ఐ సత్యనారాయణ హెడ్ కానిస్టేబుల్ హేమనాథ్ కానిస్టేబుల్ నరేష్ శ్రీను లను పోలీస్ కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు.




## ఖమ్మం నగరంలో అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు

*ఖమ్మం కార్పొరేషన్ మార్చి 17 ప్రభాత వార్త*



ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని వైరా రోడ్‌లో డివైడర్లపై ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ బోర్డులు, ఫ్లెక్సీలు పాదాచారులకు ఇబ్బంది కలిగించడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం మరియు దీళినీ సిబ్బందితో కలిసి ఇవన్ని తొలగించడం జరిగింది. పౌరుల సౌకర్యం మరియు నగరంలోని ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టామని, ఇకపై కూడా నగరంలోని అనధికారిక ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ తొలగించే ప్రక్రియ కఠినంగా కొనసాగుతుందని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని వైరా రోడ్‌లో డివైడర్లపై ఏర్పాటు చేసిన హోర్డింగ్స్, బోర్డులు, ఫ్లెక్సీలు పాదాచారులకు ఇబ్బంది కలిగించడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం మరియు డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి ఇవన్ని తొలగించడం జరిగింది. పౌరుల సౌకర్యం మరియు నగరంలోని ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టామని, ఇకపై కూడా నగరంలోని అనధికారిక ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ తొలగించే ప్రక్రియ కఠినంగా కొనసాగుతుందని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ

*ఖమ్మం కార్పొరేషన్ మార్చి 17 ప్రభాత వార్త*



పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. సోమ వారం రఘునాథపాలెం మండలం మంచుకొండ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు భానుమతి, అంజన్రాజు, కె. శ్రీనివాసరావు, సుజాత, నజీమా, రంజాన్ అలీ, రామారావు, ఆర్. శ్రీనివాసరావు, రాధ చరిత, రాజేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం మధ్య గేటు వద్ద అండర్ పాస్‌కు రైల్వే మంత్రి హామి

**ఎంపీ రవిచంద్ర వినతికి**

**సానుకూల స్పందన**

*ఖమ్మం, మార్చి, 17, ప్రభాత వార్త :*

ఖమ్మం నగరంలోని రైల్వే మధ్య గేటు సమస్యకు శాశ్వత పరిష్కారానికి హామీ లభించింది. ఈ మేరకు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం పార్లమెంటులో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసారు. మధ్య గేటు ప్రాధాన్యత, వ్యాపార, వాణిజ్య సంబంధాలు, రెండు పట్టణ ప్రాంతాల కలయిక తదితర అంశాలపై ఆయన రైల్వే మంత్రికి సోదాహరణంగా వివరించారు. ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి కి సానుకూలంగా స్పందించిన మంత్రి మధ్య గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం పై సాధ్యాసాధ్యలను పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులకు సూచించారు. ఖమ్మం మధ్య గేటు సమస్య పై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ఎంపీ రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు రైల్వే శాఖ పై రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర మధ్య గేటు సమస్యను ప్రముఖంగా ప్రస్తావించారు. కమాన్ బజార్, గాంధీ చౌక్ ప్రాంతాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలకు ప్రధాన మార్గమైన ఈ గేటు గడిచిన నాలుగు నెలలుగా మూసి ఉంచడం వల్ల వ్యాపార లావాదేవీలు స్థంబించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో ప్లాట్ ఫాం విస్తరణ పనులు వేగం పెంచి. తక్షణమే మధ్య గేటు ను వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అక్కడ ఆర్వోబీ లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ఎంపీ రవిచంద్ర పార్లమెంట్ లో రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.



## ఎమ్మార్పీఎస్ దీక్షలు

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17ః



మణుగూరు మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్ష నిర్వహిస్తున్నారు. ఈ దీక్షలో సోమవారం మణుగూరు ఎమ్మార్పీఎస్ ఇంఛార్జీ కొమ్ము హుస్సేన్ మాదిగ, మోదుగ వెంకటేశ్వరరావు మాదిగ, మందా కృష్ణ మాదిగ, అర్రా కనకయ్య మాదిగ,రాజన్న మాదిగ, కార్తిక్, రాసపల్లి లక్ష్మీ, మందా లక్ష్మీ, భవాణీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17ః



లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్త్ క్లాస్ మండల లెవల్ టాలెంట్ టెస్టులో మణుగూరు ఏరియా సింగరేణి హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి బహుమతులు అందుకున్నారు. ఈ టాలెంట్ టెస్టులో డి.సాయినాథ్ ప్రథమ స్థానం,ఎం.భానుప్రసాద్ ద్వితీయ స్థానం సాధించినట్లు మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు నల్లగట్ల సత్యప్రకాశ్ సోమవారం తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ గాజుల రమేష్‌కుమార్, సెక్రటరీ మీరా హుస్సేన్, ఇంచార్జ్ హెచ్‌ఎం కల్యాణి, ఉపాధ్యాయులు కృష్ణ బాబు, సరిత, రాజసంహ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రుల దిష్టి బొమ్మలు దహనం చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

**-మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో 20 మంది కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు**

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17ః

మణుగూరు పట్టణంలో మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టి బొమ్మలు దహనం చేసిన వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని కోరుతూ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టి బొమ్మలను 20 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేసినట్లు వారిపై వెంటనే కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారిపై ఎఫ్‌ఐఆర్ చేయకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, అక్కి నర్సింహారావు, ఆవుల నర్సింహారావు, ముద్దంగుల కృష్ణ, వడ్లూరి రాంబాబు,ఎగ్గడి నర్సింహారావు, రామకోటి, వేర్పుల సురేష్, బోశెట్టి రవి, గుర్రం సృజన్, బుద్దుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలే నవసమాజ నిర్మాణ కర్తలు

**- వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు**

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి 17:



మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మెరుగైన సమాజ నిర్మాణం కోసం సమయాన్ని వెచ్చించి లాభాపేక్ష లేకుండా సేవ చేయడం అభినందనీయమని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సాయినగర్ లోని ఓ ఫంక్షన్ హాల్లో ఇరువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసి, సమాజ సేవలో వివిధ రూపాల్లో లాభాపేక్ష లేకుండా సమాజానికి సేవలందిస్తున్న మహిళలను, ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్యామ్, అంజలిలతో కలిసి సన్మానించి జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. మహిళలే నవ సమాజ నిర్మాణ కర్తలని పిల్లలకు ఆది గురువు తల్లి అవుతుందని ఆమె నేర్పే విద్యాబుద్ధులతోనే గురువులు, లాయర్లు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తయారవుతారని అలాంటి మహిళల సేవలు గుర్తించాల్సిన ఆవశ్యకతను గుర్తించి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సమాజసేవలో మమేకమవుతున్న పలువురు మహిళల సేవలను కీర్తిస్తూ నాగులజ్యోతి, చిత్తలూరి ఉమ, లంకా సూర్యకుమారి, పారుపల్లి పద్మజ, బంగారు సంధ్య, దేవులపల్లి సూర్యకుమారి, దోసపాటి స్వర్ణలను సన్మానించినట్లు తెలిపారు. అనంతరం మణుగూరు చెందిన శ్రావణ లక్ష్మి, లావణ్యలకు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ దోసపాటి స్వర్ణ, ఐపీసీ బండారు నర్సింహారావు, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టూరి శేషుబాబు, జిల్లా పీ ఆర్ ఓ కడవెండి విశ్వనాథగుప్తా, మాజీ డిస్ట్రిక్ట్ జోన్ ఛైర్మన్ దింటకుర్తి బ్రహ్మయ్య, వర్తక సంఘం ఉపాధ్యక్షులు దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి ధర్మారావు, కంకటాల సాయి కుమార్, సముద్రాల కృష్ణమూర్తి, సుగ్గల ఇందుమతి, కొత్తా ఇందుమతి, కేసా రాజేంద్రప్రసాద్, చిత్తలూరి రమేష్, మురహరి, సుగ్గల సూర్యం, వడియాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం...

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17:



మణుగూరు మున్సిపాలిటీలోని విఠల్ రావు నగర్ కి చెందిన మాలోత్ కృష్ణ అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానిక శ్రీరాం యూత్ కమిటీ సోమవారం సాయంత్రం రావుల కృష్ణ ఆర్థిక సహకారంతో రూ.1100, నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని గుర్తించి సాయమందించిన రావుల కృష్ణను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

అశ్వాపురం, ప్రభాతవార్త, మార్చి 17:



మణుగూరు నుండి పాల్వంచ కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ గిలీ 05 గిలీ4158 నెంబర్ గల లారీ ని సోమవారం తెల్లవారుజామున నమ్మదగిన సమాచారం మేరకు అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి తమ సిబ్బంది తో కలిసి అశ్వాపురం పెట్రోల్ బంక్ వద్ద పట్టుకోవడం జరిగింది. పట్టుకున్న లారీ లో సుమారు 180 క్వింటాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.




## విద్యార్థుల వీడ్కోలు సభ

అశ్వాపురం, ప్రభాతవార్త, మార్చి 17:



మండల పరిధిలోని నెల్లిపాక బంజర జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల లో సోమవారం పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సభ పాఠశాల హెచ్ ఎమ్ శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వీడ్కోలు సభ కు సారపాక ఐటీసీ సంస్థ పిఆర్వో చెంగలరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కు హాల్ టికెట్ లు,ఫ్యాడ్ లు, పెన్నులు,కంబాక్స్ లు,చెంగలరావు, గ్రామపెద్దలు చేతులమీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చెంగలరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉన్నత ప్రతిభ చూపించడానికి తొలిమెట్టు ఈ పదవతరగతి పరీక్షలని, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు, చదువు నేర్చుకున్న పాఠశాలకు, మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఐటీసీ సంస్థ వారు ప్రభుత్వ పాఠశాలకు కావలసిన నోట్ బుక్స్, టాయిలెట్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం,పాఠశాలకు ప్రహరీ నిర్మాణాలు, పిల్లలు కూర్చోవడానికి బెంచెస్ వంటి అనేక మౌలిక సదుపాయాలను అందిస్తుందని అన్నారు. రానున్న కాలం లో ప్రభుత్వ పాఠశాలలకు మరికొన్ని సదుపాయలు ఐటీసీ సంస్థ ద్వారా అందచేస్తామని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి మంచిగా చదువుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయం లో ఉండవలసిన తీరు గురించి, పరీక్షలు రాసే అన్ని రోజులు ఇంటి వద్ద ప్రిపేర్ అయి మన పాఠశాల కు మంచి గుర్తింపు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో నెల్లిపాక పంచాయితీ సెక్రటరీ వెంకటేశ్వర్లు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ చేబ్రోలు పార్వతి, మాజీ సర్పంచ్ వెంకటరమణ,గ్రామ పెద్దలు విరమచినేని రాజశేఖర్, బిక్కసాని సత్యనారాయణ, అమరిపురి శివాజీ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది,పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ స్పోర్ట్స్ సెలక్షన్స్

అశ్వాపురం, ప్రభాతవార్త, మార్చి 17:



మండల పరిధిలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో భద్రాచలం ఐటిడిఏ పిఓ ఆదేశాల మేరకు జరిగినటువంటి జోనల్ స్పోర్ట్స్ సెలక్షన్స్ లో ఐదవ తరగతిలో అడ్మిషన్ కోసం స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని(బాలుర ), స్పోర్ట్స్ స్కూల్ కాంచనపల్లి (బాలికలు ), లకు స్పోర్ట్స్ నిర్వహించడం జరిగింది. గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో సోమవారం జరిగిన స్పోర్ట్స్ కు హాజరుకాని విద్యార్థులు ఎవరైనా ఉంటే ఈ నెల 18 తారీఖునాడు ఏహెచ్‌ఎస్ అర్లగూడెం పాఠశాల నందు నిర్వహించే జోనల్ స్పోర్ట్స్ కు హాజరు కాగలరని భద్రాచలం ఐటీడీఏ స్పోర్ట్స్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో గొందిగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్ చందు,భద్రాచలం ఏటిడివో,ఏఎస్వో నాగేశ్వరరావు,కో కన్వీనర్ వెంకటేశ్వరరావు,వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధిక విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలి

**- బీటీబీఎస్ సీఈ బి. బిచ్చన్న**

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17ః



విద్యుత్ ఉద్యోగులు వృతి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ అధిక విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలని బీటీబీఎస్ సీఈ బి. బిచ్చన్న అన్నారు. ఆయనసోమవారం టీఎస్‌పీఈయూ -1535 వార్షికోత్సవంలో మాట్లాడారు. యాజమాన్యం విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. తొలుత ఆయన కేక్ కట్ చేసి ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు వి. ప్రసాద్, కార్యదర్శి ఆర్. రామచందర్, రాజమనోహర్, రఫీ. అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, జార్జ్, పుల్లారావు, రవికుమార్, వీరబాబు, మురళి, వెంకటరమణ, రవిచంద్ర, జానీ బేగం, ఈశ్వరీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## పూజారి జ్యోతికి ఉత్తమ గాయనీ అవార్డు

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17ః



మణుగూరుకు చెందిన గాయని పూజారి జ్యోతికి కల్లీ నర్సయ్య దొర ఛారిటబుల్‌ట్రస్ట్, విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్‌కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఉగాది పురస్కారాలు-2025 సంబరాల్లో భాగంగా హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో జాతీయ స్థాయి జగత్ విఖ్యాత పురస్కారంగాను ఉత్తమ గాయని అవార్డు, ప్రశంసపత్రం అందజేసినట్లు సోమవారం ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్వీఆర్ వెంకటేష్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

## గెజిట్ ప్రకారమే వేతనాలు చెల్లించాలి

**- సిఐటియు కార్యదర్శి మధు**

కారేపల్లి మార్చి 17 ప్రభాతవార్త:

హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ వేతనాలు తగ్గించే జీవో నెంబర్ 64 ను రద్దు చేయాలని, కనీస వేతనాల గెజిట్ ప్రకారమే వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధు డిమాండ్ చేశారు. హాస్టల్ డైలీ వేస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె సోమవారం సింగరేణి మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా సమ్మె జరుగుతున్న కేంద్రాలను సందర్శించిన మధు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ ని పర్మినెంట్ చేయాలని, హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ వేతనాలు తగ్గించేలా ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. శ్రమను దోచుకోవటమేనని హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సింది పోయి తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. పిల్లలకు భోజనం అందించడం కోసం ఇతర మార్గాలను అన్వేషించటం నిలిపివేసి వర్కర్ సమస్యలు పరిష్కరించాలని లేనియెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొమ్మల అనంత రాములు,బానోత్ శ్రీనివాసరావు, ధరావత్ మాత్రు, బానోతు సందియా, పొదుగు కృష్ణ, బోడసారంగిని, బానోతు రంగ్య, బాదావత్ వీరు, మాలోత్ సూర్య నాగమ్మ,స్వరూప, నాగేశ్వరరావు,కబీర్, కబూరియా, నెహ్రు, వెంకటమ్మ, వీరు, స్వరూప, గోపి,అనంత రాములు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## మాల మహానాడు అధ్యక్షుడుగా పండగ

ఇల్లందు అర్బన్, మార్చి 17, ప్రభాతవార్త:



నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పండగ ప్రసాదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సుభాష్ నగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఆ సంఘ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ హాజరై మాట్లాడారు. బాధ్యతలు తీసుకున్న వారందరూ మాల మహానాడు సంఘ బలపేతానికి, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శిగా మంచాల జాన్ బాబు, గౌరవ సలహాదారుగా బి.ఎన్ గోపాల్, గౌరవాధ్యక్షులుగా తమ్మిదల బిక్షం, ఉపాధ్యక్షులుగా రాజు, కోశాధికారిగా బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గద్దె శ్రీనివాస్, సభ్యులుగా బి.ఎన్ రాములు, వీరస్వామి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ఇల్లందు అర్బన్, ప్రభాతవార్త:



విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేంత వరకు నిరంతరం కృషి చేయాలని సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ జి. సుధాకర్ సూచించారు. సోమవారం ఇల్లందు సింగరేణి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు సెల్ఫోన్ కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు విద్యార్థుల నడవడికలపై దృష్టి సారించాలని కోరారు. పరీక్షా సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకొని పరీక్షా సమయానికి వారి సెంటర్ కి 20 నిమిషాలు ముందుగా వెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ జాయింట్ సెక్రటరీ వై. సునీల్ ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, ఇంచార్జ్ స్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

**-మణుగూరు ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్**

మణుగూరు, ప్రభాతవార్త, మార్చి17ః



ఎంతో సమర్థవంతగా సంక్షేమ విభాగం విధులు నిర్వహించాలని మణుగూరు ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన సంక్షేమ అధికారులు, పీవోఏలు, ఆయా డిపార్ట్‌మెంట్ల మినిస్టీరియల్ స్టాఫ్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని అంశాలపైన సమీక్ష చేసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండలని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ పీవోలు ఎస్.శ్రీనివాస్, వి. రామేశ్వరరావు, ఓంకార్‌బాబు, ఎస్. చంద్రకిరణ్, అరుణ్‌తేజ, వంశీకృష్ణ, లక్ష్మణ్‌రావు, మధు, రాయదర్, నర్సింహారావు, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు వార్త

**ఇల్లెందు, గుండాల, టేకులపల్లి**

## సీతారామ ద్వారా ఆంధ్ర ప్రాంతం సస్యశ్యామలం..

ఇల్లందు, మార్చి 17, ప్రభాతవార్త:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఆంధ్ర ప్రాంతానికి తరలించి అక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని చూస్తున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈసాల సురేష్ ఆరోపించారు. పట్టణంలోని స్థానిక గోవింద్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం వలన భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు నీళ్లు వచ్చి ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాయని రైతులు ఆశపడ్డారన్నారు. కానీ వారి ఆశలను అడిఆశలు చేస్తూ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు ఖమ్మం జిల్లా మైదాన ప్రాంతంతోపాటు నల్గొండ జిల్లాలకు నీళ్లు తరలిస్తున్నారన్నారని విమర్శించారు. ఆ జిల్లాల కింద ఉన్న ఆంధ్ర ప్రాంతం సస్యశ్యామలం కానుందని తెలిపారు. ఇంత జరుగుతున్న జిల్లాలోని ఆదివాసి ఎమ్మెల్యేలు కనీసం అడ్డుకోకపోవడం విచిత్రంగా ఉందన్నారు. దగ్గరుండి రైతులను దగా చేస్తూ నిట్ట నిలువున ముంచుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నలుగురు ఆదివాసి ఎమ్మెల్యేలు మళ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజల దగ్గరకు ఎలా వస్తారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వస్తున్న నీళ్లను ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల భూములకు తరలిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఆదివాసి ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు చుక్క నీరు రాకున్నా ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలిపోతున్నా వ్యతిరేకించకుండా ఇక్కడి ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ జిల్లా రైతుల పొలాలకు, ప్రజలకు తాగు నీళ్లు అందే వరకు దశలవారీగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు వాగబోయిన చంద్రయ్య, పూనెం శివరాం, వట్టం నాగేశ్వరరావు, రామచంద్రు, చీమల వెంకటేశ్వర్లు, కోటయ్య తదితరులు ఉన్నారు.

## ఆల్ఫా టెక్ టీషర్ట్స్, టోపీలు ఆవిష్కరణ

ఇల్లందు టౌన్, మార్చి 17, ప్రభాతవార్త :




ఆల్ఫాటెక్ లోగో తో ఉన్న టీ షర్ట్ లు, టోపీలను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో విద్యుత్ ని యంత్రణకు ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్ ను ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు ఆల్ఫా టెక్ ఎనర్జీస్ అండ్ ఇన్ఫ్రా ఏజెన్సీ ముందడుగు వేసిందన్నారు. ఇల్లందులో ఉన్న ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ కు టీ షర్ట్స్, టోపీలను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, సీనియర్ నాయకుడు మడుగు సాంబమూర్తి, గోచికొండ సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బొల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పర్యటించిన జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు హుస్సేన్

- కొండరెడ్ల సంక్షేమానికి ఐటిడిఎ అన్ని విధాలా కృషి
- 100శాతం సబ్సిడీతో రుణాలు
- అధికారుల దృష్టికి మీ సమస్యలను తీసుకువెళ్ళాలి

అశ్వారావుపేట అర్బన్, మార్చి 17 (ప్రభాతవార్త):

మారుమూల ప్రాంత కొండరెడ్ల గిరిజన కుటుంబాలు తప్పనిసరిగా మీ యొక్క సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని పోయి కావలసిన పనులు చేయించుకోవాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు బాలోత్ హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం అశ్వారావుపేట మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఎ పిఓ బి రాహుల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహ్య ప్రపంచానికి దూరంగా బతుకుతున్న కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని విధాలుగా 100శాతం సబ్సిడీతో వారికి కావల్సిన రుణాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు పై చదువులు చదివే వరకూ ఆర్థిక వెసులుబాటు కల్పించడం జరుగుతుందన్నారు. ఉన్నత చదువులు చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగాలలో ఉపాధి కల్పిస్తామని అలాగే ఐటిడిఎ ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు కొండరెడ్ల గిరిజనులకు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ మాట్లాడుతూ పై చదువులు చదువుకొని నిరుద్యోగులైన యువతీ యువకుల కొరకు తప్పనిసరిగా జాబ్‌మేళాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అందుకు యువతీ యువకులు ఉన్న ఊరు వదిలి ఉద్యోగాలు చేయడానికి తప్పనిసరిగా పట్టణ ప్రాంతాలకు వెళ్ళి కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాలని అలాగే తిరుమలకుంట గ్రామంలోని కొండరెడ్ల గిరిజనులకు ఇళ్ళ నిర్మాణం, సిసి రోడ్లు, డ్రైనేజీల



పనులు తప్పనిసరిగా చేయిస్తామని అన్నారు.

అదే విధంగా ఐటిడిఎ పిఓ రాహుల్ మాట్లాడుతూ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు గత ఏడాది సెప్టెంబర్ మాసంలో ప్రతీ కుటుంబానికి ఇంటింటికి సర్వే నిర్వహించి పిఎం జన్మన్ పథకంలో భాగంగా బ్యాంక్ అకౌంట్‌లు, ఆధార్ కార్డులు, జీవిత భీమా పాలసి సంబంధించిన కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఏడు గ్రామాల కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు ప్రత్యేక సభలు నిర్వహించి అందరికి ఇప్పించడం జరిగిందన్నారు. కొండరెడ్ల కుటుంబాలలోని పిల్లలకు బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలు కొత్తగూడెం ఖమ్మంలో నడుస్తున్నాయని ముందుగా పివిజిటి పిల్లలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. కొండరెడ్ల పిల్లలకు ఐటిడిఎ ద్వారా ఉన్నత విద్యకు అన్ని ఖర్చులు భరిస్తామని, ఐటిడిఎ పనిచేస్తున్నది కొండరెడ్ల కుటుంబాల సంక్షేమం ఒకకు కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ట్రైకార్ ద్వారా రుణాలు అందజేస్తామని, ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జివిఆర్‌వి ట్రస్ట్ చైర్మన్ జలగం ప్రసాదరావు, ఆర్‌డిఓ మధుసూధన్, డిఎఫ్‌ఓ కృష్ణగౌడ్, ఎస్సీ ఎంపిడిసిసిఎల్ మహేందర్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఎఓ సున్నం రాంబాబు, డిఇ బాపనయ్య, ఎఇ ప్రసాద్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మూడొవ రోజుకు చేరిన ఎంఆర్‌పిఎస్ దీక్షలు

దమ్మపేట, మార్చి 17 (ప్రభాతవార్త):



స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 3వ రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర సెక్రటరీ కొలికపోగు కాంతారావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఇచ్చిన తరువాతనే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురాకముందు వివిధ పరీక్షల ఫలితాలను విడుదల చేసి మరొక సారి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేసిందన్నారు. మాదిగలకు మాటలు చెప్పి మాలలకు ఉద్యోగాలు దోచి పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొలికపోగు ముసలయ్య, మండల అధ్యక్షుడు కొలికపోగు అశోక్, రాయల పుల్లారావు, తోట కన్నారావు, నార్లపాటి రామకృష్ణ, చట్ల శ్రీనివాసరావు, రాయల ఉదయ్, బజారు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖకు వినియోగదారుల వినతి

దమ్మపేట, మార్చి 17 (ప్రభాతవార్త):

మండల కేంద్రం దమ్మపేటలో విద్యుత్ అంతరాయం ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు మండల విద్యుత్‌శాఖకు విన్నవించుకుంటున్నారు. ప్రధనంగా మండలపల్లి సబ్ స్టేషన్‌లో మందలపల్లికి, దమ్మపేటకి ఒకే ఫీడర్ ఉండటం వలన ఏదైనా విద్యుత్ సమస్య వచ్చినప్పుడు రెండు ఊర్లకు విద్యుత్ ఆపవలసి వస్తుంది. దీని వలన మందలపల్లి, దమ్మపేట ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు కూడా ఇబ్బంది కలుగుతుంది. కావున దమ్మపేటకు ప్రత్యేక బ్రేకర్ పెట్టాలని కోరారు. అదే విధంగా దమ్మపేట ఎఇ ఆ బ్రేకరకు సంబంధించి ఎస్టిమేషన్ వేశారని అది ఎస్ఇ పరిధిలో ఉందని కావున ఎస్ఇ త్వరగా మంజూరి చేసి దమ్మపేట విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ఎన్నికల హామీ మేరకు ఆశాలకు వేతనాలు పెంచాలి

- ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



అశ్వారావుపేట రూరల్, మార్చి 17 (ప్రభాతవార్త):

ఎన్నిల హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఆశాలకు వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్‌ల సాధనకోసం అనేక ఆందోళనల ఫలితంగా కమీషనర్ స్పందిస్తూ రూ.50లక్షల ఇన్సూరెన్స్ కల్పిస్తామని, మట్టిఖర్చులకు రూ.50వేలు ఇస్తామని, టార్గెట్ రద్దుచేస్తామని హామీలు ఇచ్చి నేటికి నెరవేర్చలేదన్నారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యలపై చర్చించి వారి సమస్యలు పరిష్కరించాలని, ఎఎన్ఎం ట్రైనింగ్ పూర్తిచేసిన ఆశాలకు ఎఎన్ఎం పోస్తులలో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజ్ మార్కులు వెంటనే నిర్ణయించాలని, ఆశాలకు డ్యూటీలు వేసే సందర్భంగా వెహికిల్‌తో పాటు సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతి, నాగమణి, తిరుపతమ్మ, విష్ణుకుమారి, మంగ, చిలకమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.




## ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే

- మొబైల్ అంగన్‌వాడీ సెంటర్‌లను రద్దు చేయాలి

అశ్వారావుపేట రూరల్, మార్చి 17 (ప్రభాతవార్త):



ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే పిఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్‌లను రద్దు చేయాలని, హామీ మేరకు వారికి రూ.18వేల వేతనం పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండల కమిటి ఆధ్వర్యంలో ఒకరోజు దీక్ష స్థానిక రింగ్‌రోడ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్య విధానం చట్టాన్ని అమలు చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలని, మినీ నుండి మెయిన్ అంగన్‌వాడీ టీచర్‌లకు పెండింగ్‌లో ఉన్న 10నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు కట్టా రాధ, కృష్ణవేణి, రాజేశ్వరి, లక్ష్మి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

దమ్మపేట, మార్చి 17 (ప్రభాతవార్త):



ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నిల హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఆశాలకు వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్‌ల సాధనకోసం అనేక ఆందోళనల ఫలితంగా కమీషనర్ స్పందిస్తూ రూ.50లక్షల ఇన్సూరెన్స్ కల్పిస్తామని, మట్టిఖర్చులకు రూ.50వేలు ఇస్తామని, టార్గెట్ రద్దుచేస్తామని హామీలు ఇచ్చి నేటికి నెరవేర్చలేదన్నారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యలపై చర్చించి వారి సమస్యలు పరిష్కరించాలని, ఎఎన్ఎం ట్రైనింగ్ పూర్తిచేసిన ఆశాలకు ఎఎన్ఎం పోస్టులలో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజ్ మార్కులు వెంటనే నిర్ణయించాలని, ఆశాలకు డ్యూటీలు వేసే సందర్భంగా వెహికిల్‌తో పాటు సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సునీత, శారద, రాధ, సంధ్య, నాగమణి, సుజాత, వరద రాణి, మంగ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేట రూరల్, మార్చి 17 (ప్రభాతవార్త):

వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద బిసి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి తగు ప్రణాళికలు ఆమోదించింది. కావున అర్హత, ఆసక్తిగలవారు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని ఈ నమోదు ప్రక్రియ 17.03.2025 నుండి 05.04.2025 వరకూ అందుబాటులో ఉంటుందని మరిన్ని వివరాల కొరకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవ సహకార సంఘాల సంస్థ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

# మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## - ఎమ్మెల్యే రాందాస్ నాయక్

## - స్త్రీ టీ స్టాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

కారేపల్లి, మార్చి17 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం అందజేస్తుందని వైరా శాసనసభ్యులు మాలోత్రాందాస్ నాయక్ అన్నారు. మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి అనే నినాదంలో భాగంగా ఇందిరా మహిళా పథకం సింగరేణి మండల (సెర్ప్) విజేత మహిళా సమైఖ్యా అందజేసిన రుణంతో వెన్నెల గ్రామ సమైక్య, పెద్దమ్మ తల్లి ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యురాలు కంచి నాగలక్ష్మికి కేటాయించిన స్త్రీ టీ స్టాల్ ను సోమవారం వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి హాజరైన రాందాసు నాయక్ కు మహిళలు ఘన స్వాగతం పలికి హారతులు పట్టారు. స్త్రీ టీ స్టాల్ ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందన్నారు. అన్ని రంగాల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత 10 సంవత్సరాలుగా ప్రజలను పట్టించుకోని వారు నేడు పనిచేసుకుంటూ ప్రజల నీరాజనాలు పొందుతున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి మరొక కొత్త ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సింగరేణి



మండలం ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు పనిచేస్తున్నారని, సింగరేణి మండల మహిళా మణుల కోసం ఇంకా ఎంత నిధుల కేటాయిస్తావని ఎమ్మెల్యే అడగగా, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని సింగరేణి మండలం లో మహిళలకు అందజేసే వరకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఏపీఎం పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్లో ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతుందని పేర్కొన్నారు. కాగా అంతకుముందు లబ్ధిదారురాలు కంచి నాగలక్ష్మి భర్త కంచి రమేష్ ఇటీవల కాలం మృతి చెందడంతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ తో ఉన్న సానిహిత్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు చైతన్య, పగడాల పుష్ప, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సుహాసిని, గ్రామ సమైక్య అధ్యక్షురాలు ప్రమీల, వివోఏ పాలిక మమత, మండల కాంగ్రెస్ నాయకులు మేదరి టోనీ, భానోత్ హీరోలాల్, గుగులోత్ భీముడు ధారావత్ వినోద్ నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, మల్లెల నాగేశ్వరరావు, తాజుద్దీన్, శ్రీను రెడ్డి, గౌస్ పాషా, తోగర శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోట్లు పలికిన పండితాపురం పశువుల సంత

## - వేలంలో సంత ను కైవసం చేసుకున్న భూక్య వీరన్న

## - భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు

కామేపల్లి,మార్చి 17 ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పండితాపురం శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల సంత వేలంలో కోట్లు పలికింది.సంత ప్రాంగణంలో అధికారులు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు.రూ. 2,35,70,000 ల నుండి పాటను ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన భుక్యా వీరన్న రూ.2కోట్ల 42లక్షల30 వేలకు సంతను కైవసం చేసుకున్నాడు. సంవత్సర కాలానికి వేలం పాట నిర్వహించగా వేలంలో వీరన్నతో పాటు బోడా శ్రీను, బానోతు లక్ష్మ నిబంధనల మేరకు



ధరావతు సొమ్ము చెల్లించి పాటలో పాల్గొన్నారు. అత్యధిక ధరకు పాట పాడిన వీరన్న కు సంత దక్కింది. డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ అనుచరుడు వీరన్న సంతను కైవసం చేసుకోవడం జరిగింది. గత



ఏడాది కంటే ఈ పాట ద్వారా పంచాయతీకి రూ. 36.20 లక్షల ఆదాయం అదనంగా రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ రాంబాబు, ఎంపీడీవో జి. రవీందర్, కామేపల్లి, ఏన్కూరు, తిరుమలాయపాలెం, సింగరేణి మండలాల పంచాయతీ అధికారులు పి. ప్రభాకర్ రెడ్డి,జీవిఎస్, రవీంద్ర ప్రసాద్, కొమ్మినేపల్లి పంచాయతీ కార్యదర్శి శంకర్, రుక్కీ తండా పంచాయతీ కార్యదర్శి ఎం డి ఫజల్,జి నెహ్రూ,వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కారేపల్లి రూరల్ సిఐ బి.తిరుపతి రెడ్డి నేతృత్వంలో కామేపల్లి ఎస్సై బి.సాయికుమార్, పోలీస్ సిబ్బంది సంత పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేసి విస్తృత బందోబస్తు నిర్వహించారు. దీంతో హోరాహోరీగా సాగిన వేలంపాట ప్రక్రియ ప్రశాంతంగా విజయవంతంగా ముగిసింది.

# ఆలయంలో 16 రోజుల పండుగ వేడుకలు

## - భారీగా తరలివచ్చిన భక్తులు

కారేపల్లి మార్చి 17 ప్రభాతవార్త :



పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నామస్మరణతో దేవాలయ ప్రాంగణమంతా దద్దరిల్లింది. సోమవారం మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించి ఈ నెల రెండో తేదీన పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్టలు జరగ్గా స్వామివారి 16 రోజుల పండుగను శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు అనంతోజు తిరుమలాచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడు ఆంజనేయస్వామి శంకరుడు నవగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజల నిర్వహించారు అనంతరం స్వామివారి దంపతులను ప్రత్యేక అలంకరణలు చేసి పంచామృత అభిషేకాలు సంప్రోక్షణ యాగశాల ఉద్వాసన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు తుమ్మోజు రామమూర్తి వేములూరి కోటాచారి అద్దంకి వీరభద్రాచారి పోలోజు రామాచారి అనంతారపు వెంకటాచారి పోలోజు నరసయ్యాచారి పోలోజు ఉపేంద్రచారి మోడీపల్లి వెంకటాచారి కాపర్తి వెంకటాచారి పాలిక లింగయ్య కొమ్ము ఉపేందర్ తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో కామేపల్లి ఆశ్రమ పాఠశాల ఎదుట దీక్ష

## - దీక్ష శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి బి.మధు

## - సంఘీభావం తెలిపిన జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ

కామేపల్లి, మార్చి 17 ప్రభాతవార్త :




ప్రభుత్వం గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైలీ వేజ్ వర్కర్స్ గా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కామేపల్లి మండల సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కామేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. వర్కర్స్ కు గతంలో ఇచ్చిన వేతనాల కంటే తక్కువ వేతనా లు ఇస్తుండడం ను నిరసిస్తూ దీక్ష నిర్వహించారు.ఈ దీక్ష కార్యక్రమాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు పాల్గొని ప్రారంభించారు.దీక్షకు మద్దతుగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు దుగ్గి కృష్ణ సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఏర్పుల శాంతయ్య,రామ్ సింగ్, బాబు,వర్కర్స్ అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.




కారేపల్లి, వైరా, కొణిజర్ల, ఏన్కూరు

# విద్యార్థులకు చందు ఫౌండేషన్‌చే ఎగ్జామ్ కిట్ పంపిణీ

కారేపల్లి మార్చి 17 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన కారేపల్లి కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం చందు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మేకల తండాకు చెందిన భూక్య వీరన్న జ్యోతి దంపతులు ఎగ్జామ్ కిట్టును అందజేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఉపయోగపడేలా పరీక్ష ప్యాడ్ కంపాస్ బాక్స్ పెన్ను ఇతర పరికరాలను అందజేస్తున్నట్లు దాతలు తెలిపారు. విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జయరాజ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు సహకరిస్తున్న దాతలను అభినందించారు. సేవా దృక్పథంతో చేస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించేలా చూడాలని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ ఉన్నత స్థానం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ జి స్వర్ణలత లక్ష్మణ్ ఉపాధ్యాయులు స్వాతి కవిత విజయలక్ష్మి విజయ మమత తదితరులు పాల్గొన్నారు.

# రెమ్యూనరేషన్ వెంటనే విడుదల చేయాలి

కారేపల్లి మార్చి 17 ప్రభాతవార్త :



ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యుమ రేటర్లకు రెమ్యునరేషన్ వెంటనే విడుదల చేయాలని యూనియన్ నాయకులు మండల తాసిల్దార్ సంపత్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.మండల టీజీ టీటీఎఫ్ శాఖ నేతలు మాట్లాడుతూ కుటుంబ సర్వే చేసి ఆరు నెలలు గడిచిన ఇంతవరకు అమోంట్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు.. కుటుంబ సర్వే త్వరగా పూర్తి చేయడానికి సహకరించిన కూడా ఎన్యూమరేటర్స్ కు నేటి వరకు అమోంట్ అందలేదని. ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తాసిల్దార్ కు వివరించడం జరిగిందన్నారు. జిల్లా అధికారులకు తెలియజేస్తానని తాసిల్దార్ తెలిపారు..ఈ కార్యక్రమంలో భూక్యా రామ్ కోటి, యూనియన్ సింగరేణి మండల అధ్యక్షులు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అజ్మీరా వీరు నాయక్, శివ నాయక్, సక్రియ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపాల్

రుద్రంపూర్, మార్చి 17 - ప్రభాతవార్త:



రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన సెయింట్ జోసెఫ్ హై స్కూల్ విద్యార్థిని మండలంలోని ధన్బాద్ పంచాయతీలో ఉన్న సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి అభినందించారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఠాగూర్ మని చంద్ర ఈనెల 16 తేదీ ఉర్దూగర్, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన తెలుగు రాష్ట్రాల స్థాయి కరాటే పోటీల్లో 2025 పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో స్వర్ణం పతాకం సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సదరు విద్యార్థిని అభినందించారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీల్లో మరెన్నో పథకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తపరిచారు.

## పాలేరు సంత రూ. 45,16,000 దక్కించుకున్న బజ్జూరి ఉపేందర్ రెడ్డి

### గతం కంటే రూ.8లక్షల 10వేలు అధికం

**ప్రత్యేకాధికారి రాంచందర్ రావు ఆధ్వర్యంలో ముగిసిన వేలంపాట**



కూసుమంచి, మార్చి 17 (ప్రభాతవార్త) :

కూసుమంచి మండల పరిధిలోని పాలేరు గ్రామంలో నిర్వహించే వారాంతపు సంతకు వేలం పూర్తయింది. సోమవారం ఎంపీవో రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి హరీష్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కూసుమంచి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బజ్జూర్ ఉపేందర్ రెడ్డి రూ. 45 లక్షల 16 వేలకు పాట పాడి పాలేరు సంతను దక్కించుకున్నాడు. గత ఏడాది రూ. 37.60 లక్షలకు ఉపేందర్ రెడ్డే పాడగా, ఈ ఏడాది 8లక్షల 10వేలు అధికంగా వచ్చింది. ఈ ఏడాది కూడా ఉపేందర్ రెడ్డే పాటను దక్కించుకున్నాడు. ఉదయం 11 గంటల లోపు 19 మంది సభ్యులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు డిపాజిట్



చెల్లించి, రసీదు పొందారు. తొలుత 25 లక్షలతో ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలలోపు రూ. 45,16,000 వేలకు ధర పలికింది. అత్యధికంగా వేలం పాడిన బజ్జూర్ ఉపేందర్ రెడ్డి పాలేరు సంత దక్కించుకున్నట్లు. కూసుమంచి స్పెషల్ ఆఫీసర్ ఎంపీఓ రామచందర్ రావు ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఆళ్ల

ఖమ్మం రూరల్, ప్రభాతవార్త



ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ గా ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిపాలన పెద్దతండలోని గ్రామపంచాయతీ నుండి నిర్వహించినట్లు తెలిపారు. నూతన మున్సిపాలిటీగా ఏర్పాటుతో చిన్న చిన్న సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 12 పంచాయితీలతో నూతనం ఏర్పడిన ఎదులాపురం మున్సిపాలిటీ ని డివిజన్లుగా విభజించి బోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీలో గల విలీన పంచాయతీలలో ఉన్న ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు

## ఆరెగూడెంలో ఘనంగా లింగమంతుల జాతర



నేలకొండపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:

ఆరెగూడెం గ్రామం నందు సోమవారం లింగమంతుల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ యాదవవ సంఘం ఆధ్వర్యంలో యాదవులు అందరు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రదర్శనగా వెళ్ళి లింగమంతుల స్వామి



వారికి బోనాలు, మొక్కులు సమర్పించారు. యాదవులు గజ్జెల లాగుల గలగలలు, కటార్ల విన్యాసాలు, డప్పు చప్పుళ్ళుతో గ్రామ వీధులలో జరిగిన ప్రదర్శన అత్యంత శోభాయమానంగా తలపించింది. భక్తులు ఓలింగా, ఓలింగా అంటూ భక్తులు చేసిన శివనామస్మరణ గ్రామ వీధులలో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, గ్రామ యాదవ సంఘం నాయకులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనా న్నరు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ



లక్ష్మీదేవిపల్లి, మార్చి 17 - ప్రభాతవార్త:

ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 23 మంది విద్యార్థులకు పైగా ఎగ్జామ్ ప్యాడ్స్, జామెంట్రీ కిట్ పంపిణీ చేయడం జరిగింది. ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ శ్రీకాంత్ లడ్డు, గౌతమ్, అర్జున్, ఉడే, వరుణ్, మొయిన్, శశి, శ్యాం, సత్య సాయి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే (బిసి) పాఠశాలలో ప్రవేశ దరఖాస్తులకు ఆహ్వానం

### - ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలి

పాల్వంచ టౌన్, మార్చి 17 - ప్రభాతవార్త:

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల నందు 5,6,7,8,9 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు 2025-26 సంవత్సరానికి గాను ఖాళీగా వున్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్టు ఎమ్ జె పి టి బిసి బాలికల పాఠశాల (పాల్వంచ) ప్రిన్సిపాల్ ఎన్.ఎ. క్రాంతి ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 5 నుండి 9వ, తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థుల ప్రవేశం కొరకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉందని అన్నారు. ఏప్రిల్ 20 తేదీన జరిగే ప్రవేశ పరీక్ష నందు ప్రతిభ కనబర్చిన, రిజర్వేషన్ ఆధారితంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రవేశాల కొరకు ఈ క్రింది వెబ్సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.




**నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం**

## శ్రీకృష్ణయాదవ సంఘం అధ్యక్షుడుగా మన్నె కృష్ణారావు ఎన్నిక

నేలకొండపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:





నేలకొండపల్లి పట్టణ శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడుగా మన్నె కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సోమవారం నేలకొండపల్లి లోని శ్రీరాజగోపాలస్వామి దేవాలయం నందు స్థానిక పట్టణ శ్రీకృష్ణయాదవ సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో సంఘం గౌరవ అధ్యక్షులుగా మెట్టెల నాగేశ్వరరావు, కుర్రి శ్రీను, కార్యదర్శిగా మేకల శ్రీను, సభ్యులుగా కొండ ఉపేందర్, మెట్టెల నరేష్, గూటి తిరుపతిరావు, రేపాకుల శివ, సోమనబోయిన వెంకన్న, కూరాకుల సంపత్, మన్నె శ్రీనివాసరావు, మల్లెబోయిన సత్యనారాయణ, చిలకల ఉపేంద్ర, పేరం అంజి, మన్నె శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నూతన పట్టణ శ్రీకృష్ణయాదవ సంఘం అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, కమిటి సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల, పట్టణ యాదవ సంఘం నాయకులు కూరాకుల నాగేశ్వరరావు, దాసరి ఉదయ్, గొలుసు రవి, మన్నె లింగారావు, మన్నె రవి, కూరాకుల ఉపేందర్ , లొడంగి వెంకన్న, లొడంగి సత్యనారాయణ, మన్నె వినోద్, చిలకల ఉపేంద్ర, దిద్ది రాజేష్, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు టీకాల పట్ల అవగాహన కల్గి ఉండాలి




నేలకొండపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరు టీకాల పట్ల అవగాహన కల్గి ఉండాలని నేలకొండపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. రోగులకు చికిత్స కంటే నివారణ ముఖ్యమని, అవగాహన ద్వారా ముందుగానే టీకాలు వేయించుకోవడం వలన రోగాల బారిన పడకుండా ఉండాలని ఆయన చెప్పారు. సోమవారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువజన కేంద్రం, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ టీకాల దినోత్సవం ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్దులు వివిద రకాల టీకాల పైన అవగాహన కల్గి ఉండాలని ఆయన చెప్పారు. అలాగే, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నిర్వహించిన వకృత్వం పోటీలలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలు ఎస్‌కే.రిజ్వానా, బి.సౌజన్యలకు బహుమతులను అందచేసారు. ఈ కార్యక్రమంలో స్దానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, మండల ఆరోగ్య పర్యవేక్షణ అధికారి బి.వీరన్న, మండల టిబి సూపర్‌వైజర్ ఎన్.దేవయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షుడు చింతమళ్ళ పాపయ్య, కళాశాల అధ్యాపకులు డాక్టర్ నారాయణస్వామి, ఎన్.వెంకన్న, వెంకటరాజం, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్దులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సాహిత్య రత్న అవార్డు పొందిన సదానందంకు సన్మానం



రుద్రంపూర్, మార్చి 17 - ప్రభాతవార్త: రుద్రంపూర్ లోని ప్రగతి వనం పార్క్ ఏరియా పరిధిలో కొత్తగూడెం ఏరియా కల్చరల్ స్పోర్ట్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో పి.వి.కే 5 షాఫ్ట్ మాజీ ఉద్యోగి జినుకుల సదానందంకు తెలంగాణ రాష్ట్రసాహిత్య రత్న అవార్డు వచ్చిన సందర్భంగా ఐఎన్టియుసి నాయకులు, కళాకారులు, క్రీడాకారులు, వారికి ఐ ఎన్ టి యుసి ఏరియా కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా సన్మానం చేశారు, రజాక్ మాట్లాడుతూ... ఆయన ఎన్నో నాటికలు రచించడం జరిగింది అంతే కాకుండా, సినీ సాహిత్య రంగంలో పాటలు రచించారు, అలాగే సింగరేణి ఉత్పత్తి కోసం స్ఫూర్తిదాయకమైన పాటలు రాసి ఉద్యోగులను ఉత్తేజ పరచడంలో ఆయనకు ఆయన దిట్ట, సింగరేణి సంస్థలో ప్రతి సంవత్సరం జరిగే సేఫ్టీ అన్యువల్ డే లో సంస్కృతి కార్యక్రమంలో అనేక ప్రదర్శనలు ఇచ్చి ఎందరో్న కళాకారులను తీర్చిదిద్దారు, అని తెలుపుతూ, ఈ మధ్యకాలంలో మరణించినటు వంటి కళాకారులు ఆరోగ్యరాజ్, బొడ్డు శ్రీను ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎస్కే గౌస్, భీముడు, సకినాల సమ్మయ్య, గోపి కుమార్ స్వామి, ఈ మోహన్ రెడ్డి, కుమార్, శనగరపు కుమార్, సిహెచ్ సాగర్, సీనియర్ కళాకారులు దేవ సహాయం, వెంకటేశ్వర్లు,లచ్చన్న ,కాయితం శ్రీనివాస్,ఆధార్, టిఆర్ఎస్ రాజు, జీవెల్ శ్రీనివాస్, క్రాంతి కుమార్, ధర్మరాజు, వెంకటేశ్వర్లు రంగినేని, లక్ష్మీ నారాయణ కోరి, రమాకాంత్, మహేష్, రాజేంద్ర ప్రసాద్, పిట్ట శ్రీనివాస్, రాజేశ్వం ాావు,కృష్ణ, వీరన్న,, కుమార్ ,వెంకటేశ్వర్లు, రవికుమార్ ,నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుల నామినేషన్‌ల స్వీకరణ





కొత్తగూడెం టౌన్, మార్చి 17 - ప్రభాతవార్త: బీజేపీ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజమోళి జిల్లాలోని అధ్యక్షులకు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌లకు పోటీ పడే వారి నుండి నామినేషన్‌లు స్వీకరించారు. నామినేషన్‌లు వేసిన వారిలో మాజీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు రంగాకిరణ్, సీనియర్ నాయకులు భూక్యా సీతారామ్ నాయక్, సోమసుందర్, ఆకుల నాగేశ్వరావు, శ్రీనివాస రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు నామినేషన్ వేసినారు. అనంతరం జిల్లా రిటర్నింగ్ అధికారి రాజమోళి మాట్లాడుతూ... దేశంలో ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా ఒక్క బీజేపీ పార్టీలోనే జిల్లా అధ్యక్షుల ఎన్నిక జరుగుతుందని అన్నారు. పోటీ చేసిన ప్రతి ఒక్కరికి కొన్ని సార్లు అనుకున్న పదవులు రాకున్నా కేవలం దేశం కోసం సమాజం కోసం పని చేసే నాయకులు కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అని అన్నారు. బీజేపీ లో పని చేసే ప్రతి ఒక్కరికి మంచి భవిషత్ ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పోడియం బాలరాజ్, ముస్కు శ్రీనివాస రెడ్డి, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, పైడిపల్లి రావేందర్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, గాంధీ, శ్రీధర్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు కాంగ్రెస్ ఇఫ్తార్ విందు



జూలూరుపాడు, మార్చి 17 - ప్రభాతవార్త: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జామా మస్జీద్ లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ నెలలో ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష లో ఉంటారని, ఓర్పు, సహనం, దయాగుణానికి, దాన ధర్మాలకి ప్రతీకగా రంజాన్ నెల ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. అనంతరం ముస్లిం సోదరులను అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వెంకటరెడ్డి ని మస్జీద్ కమిటీ అధ్యక్షులు యాసిన్, ముస్లిం సోదరులు శాలువాతో సత్కరించారు. మస్జీద్ ఇమామ్ ఆఫీ షామ్ ను వెంకటరెడ్డి శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమం లో దుద్దుకూరి మధుసూదన్ రావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు దొండపాటి శ్రీనివాసరావు (వాసు), వేల్పుల సంనింవశరావు, రావింశెట్టి నాగేశ్వరావు, పురస్తపురపు శ్రీను, లకావత్ రమేష్, మిరియాల కిరణ్ కుమార్, కొమ్మిన్ని నాగేశ్వరావు, మంద దేవేందర్, కిషోర్, ముదిగొండ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను సన్మానించిన కాపు సీతాలక్ష్మీ

కొత్తగూడెం టౌన్, మార్చి 17 - ప్రభాతవార్త:



కొత్తగూడెం మున్సిపాలిటీకి కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ సుజాతను మున్సిపల్ మాజీ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తాజా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, వెంట మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, బిఆర్ఎస్ మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు వేముల ప్రసాద్ బాబు, బండారి రుక్మాంగాదర్ రావు, అంబుల వేణుగోపాల్ పాల్గొని కమిషనర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

జూలూరుపాడు, మార్చి 17 - ప్రభాతవార్త: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు ఎంపీడీవోకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. టి యు సి ఐ రాష్ట్ర కమిటీ పిలుపుల భాగంగా వినతి పత్రాన్ని అందజేశామని కార్మికులకు వేతనాలు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ ధన్వంతరావు కార్మికులు తంబర్ల లక్ష్మి వినోద్ రాంబాబు నాగు నరేష్ వెంకటేశ్వర్లు హనుమంతరావు నరసింహారావు సేవియా తదితరులు పాల్గొన్నారు.

## మండల అధికారులు సమన్వయంతో పనిచేయండి

## చివరి ఆయకట్టు రైతులకు నీరందాలి

# తహశీల్దార్ వి. సురేష్‌కుమార్



తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త: సాగు నీటి విషయంలో మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి, చివరి ఆయకట్టు రైతులందరికి నీరు అందడం కోసం సమన్వయంతో ముందుకు వెళ్ళాలని తహశీల్దార్ వి. సురేష్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల కోఆర్డినేషన్ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో చివరి ఆయకట్టు పొలాలకు నీరందడం కోసం అధికారులు కృషిచేయాలని కోరారు. రబీ సీజన్‌లో రైతులు వేలాది రూపాయలు పంటపై పెట్టుబడులు పెట్టారని, నీరందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఇరిగేషన్ అధికారులకు మండల కోఆర్డినేటర్ల కమిటి పూర్తి సహకారం అందించి, ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం కూడా చాలా సీరియస్‌గా ఉందని, అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా రైతులు నష్టపోతారనే విషయాన్ని గ్రహించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ శ్రీనివాసరావు, ఎంపిడిఓ ఏ. సురేష్‌బాబు, ఏఓ ఎండి. తాజుద్దీన్, ఏఈ ఆషా, గిర్దావర్ ఎం. భాస్కర్, ఏపిఓ కోటయ్య, ఏఈఓలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తల్లాడలో కదం తొక్కిన సిపిఎం నాయకులు

## మండుటెండలో ఎర్రజెండా చేతబట్టి ర్యాలీ



తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయాలని, తక్షణమే రేషన్ కార్డు, డబుల్ బెడ్రూం మంజూరు చేయాలని కోరుతూ మండల సిపిఎం కమిటి ఆధ్వర్యంలో సోమవారం నాయకులు ఎర్రజెండాలు చేతబట్టి ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రభుత్వం హామీలను అమలుచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండుటెండలను సైతం లెక్కజేయకుండా సిపిఎం కార్యాలయం నుండి ఆర్టిసి బస్టాండ్, రింగ్ రోడ్ గుండా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రదర్శనకు అగ్రభాగాన సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, షేక్ మస్తాన్‌లు ప్రదర్శనలో పాల్గొని తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో హామిలిచ్చి అమలుచేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే కేసీఆర్‌ను ఎన్నికల్లో సాగనంపారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అమలుచేయకపోతే ఇంటి దారి పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం వల్లే సంక్షేమ పథకాలు అమలుచేయలేకపోతున్నామని పదే పదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు జాగ్రత్త లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలుచేసే దాకా సిపిఎం పార్టీ ప్రభుత్వం వెంటపడటం ఖాయం అని స్పష్టం చేశారు. కార్యక్రమానంతరం తహశీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భారతి, మాదినేని రమేష్, శీలం ఫకీరమ్మ, భవాని, షేక్ నన్నే సాహెబ్, కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.

*ఖమ్మం రూరల్ ప్రభాత వార్త*



గామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే మంజూచేయాలనీ, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల వేతనాలు ఒకటో తేదీనే ఇవ్వాలని రూరల్ తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గిగేది। తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూరల్ తాసిల్దాదారు రాంప్రసాద్ కి అందజేయటం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టి యు సి ఐ తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామదాస్, టి యు సి ఐ పాలేరు ఏరియా కమిటీ అధ్యక్షులు గోసు పుల్లయ్యలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం అంటూ తెలంగాణ రాష్ట్రంలో గొప్పలు చెప్తూ గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు నాలుగైదు నెలల నుంచి వేతనాలు అందించకపోగా కార్మికుల పైన పని భారం పెంచి కార్మికులను వెట్టి చాకిరి చేపిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. మల్టీ పర్పస్ విధానం రద్దు గ్రామపంచాయతీ కార్మికుల అందర్నీ పర్మినెంట్ చేయాలి పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యం కల్పించాలన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కార్మికుల అక్రమ తొలిగింపులు అధికారుల వేధింపులు నిలిపివేయాలని కారోబార్ బిల్ కలెక్టర్కు స్పెషల్ స్టేటస్ కల్పించాలి పంచాయతీ అసిస్టెంట్గా నామకరణం చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ గా 5 లక్షలు ఇవ్వాలన్నారు. ఆదివారం పండగ సెలవులు జాతీయ అంతర్జాతీయ సెలవులు మంజూరు చేయాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున గ్రామపంచాయతీ కార్మిక వర్గంతో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ రూరల్ మండల అధ్యక్షులు పల్లెబోయిన శ్రావణ్ కుమార్ రాజు ధారావత్ రామారావు పల్లెబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ఒక్క ఎకరానికి సాగునీరు లోటు రావొద్దు..

### పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలి

### ఇరిగేషన్ అధికారులు నీటి షెడ్యూల్ ముందస్తుగా ప్రకటించాలి

*కూసుమంచి, మార్చి 17 (ప్రభాతవార్త) :*



కూసుమంచి మండలంలో ఏ ఒక్కరైతుకు చెందిన ఎకరం సాగుభూమి కూడా నీరు అందక ఎండి పోకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ మండల అధికారులకు సూచించారు. సోమవారం కూసుమంచి ఎంపీడీవో కార్యాయలంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఎంపీడీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రత్యేకాధికారి రమేష్ మాట్లాడుతూ గ్రామాలలో రైతులకు సంబంధించి సాగునీటి అవసరత పంచాయతీ కార్యదర్శులు సమాచారం తెలుసుకుని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు అందించాలని సూచించారు. ఆ సమాచారం మేరకు ఇరిగేషన్ అధికారులు తక్షణమే సమన్వయం చేసుకుని ఆ రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకరికొకరు సహకరించుకుంటూ, సమన్వయంతో ముందుకెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. పాలేరు పరిధిలో పంటకాలువలను మూడు విభాగాలుగా ప్రస్తుతం నీటివిడుదల కొనసాగుతుందని నీటిపారుదల అధికారులు తెలపగా ఏ కాలువకు ఎప్పుడు నీటి విడుదల చేసేది ముందస్తుగా షెడ్యూల్ రైతులకు తెలియజేయాలని ఆయన సూచించారు. అప్పుడు రైతులు కూడా ఆందోళన చెందకుండా సహకరిస్తారని తెలిపారు. రైతుల అవసరానికి తగినట్లుగా నీటి విడుదల చేపట్టి పంటలను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణ శ్రీ, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎంఈవో రాయల వీరస్వామి, ఇరిగేషన్ అధికారిణి రత్నకుమారి, వ్యవసాయశాఖాధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఐదవ రోజుకు చేరిన దీక్షలు



*తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త*

మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎస్సీలను ఏబిసిడి నాలుగు గ్రూప్‌లుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ప్రతి మండల, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభించిన నిరసన దీక్షలు సోమవారం మండల కేంద్రమైన తల్లాడలో రింగ్ రోడ్ సెంటల్లో ఎంఆర్పిఎస్ నాయకులు చేస్తున్న దీక్ష ఐదవ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల నాగేశ్వరరావు మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, సురేష్ మాదిగ, అద్దంకి వెంకటేశ్వర్లు మాదిగ, కాంపాటి జమలయ్య మాదిగ, అంబేద్కర్ మాదిగ, ఆరూరి రవి మాదిగ, శ్రీను మాదిగ, వేణు మాదిగ, మేడి సీతారాములు మాదిగ, కృష్ణయ్య మాదిగ, కొమ్ముగిరి కృష్ణ మాదిగ, మేడి భద్రయ్య మాదిగ, గద్దల శ్రీను మాదిగ తదితరులు దీక్షలో కూర్చున్నారు.

## జట్పిహెచ్ఎస్ కుర్నవల్లి పాఠశాల వార్షికోత్సవం



*తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త*

మండల పరిధిలోని కుర్నవల్లి జట్పిహెచ్ఎస్ పాఠశాల 65వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎన్. దామోదర్ ప్రసాద్, హెచ్ఎం ఝాన్సీరాణి, ఐలూరి వెంకట కోటారెడ్డి, శేషిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటాచారి, చలపతిరెడ్డి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ విద్యార్థులను మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## మత్స్యకారులు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

*కూసుమంచి, మార్చి 17 (ప్రభాతవార్త) :*



మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ, పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, ములుగు జిల్లా తెలంగాణ (షెడ్యూల్ ట్రైబ్) మత్స్య కారులకు జరుగుతున్న 'మత్స్య రంగంపై క్షేత్రస్థాయి సందర్శన' అను అంశంపై 3 రోజుల నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం సోమవారం మొదటి రోజు విజయవంతంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా నుంచి 10 మంది మత్స్య కారులు హాజరైనట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య రంగంపై క్షేత్రస్థాయి సందర్శన అను అంశంపై జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని ములుగు జిల్లా మత్స్యకారులందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. మొదటి రోజు కార్యక్రమంలో మత్స్యకారులు నగేష్ ఆక్వా ఫార్మ్స్ జుజ్జులరావుపేటలో వెనామీ రొయ్యల పట్టుబడి, పెంపకం గురించి, తెల్ల చేపల పెంపకం, పౌల్ట్రీ కం ఫిష్ కల్చర్ గూర్చి, రాజా ఫిషరీస్ అండ్ ఆర్చిడ్స్, నాచేపల్లి లో తెల్ల చేపలు, రూప్ చందా చేపల పెంపకం గురించి, వెంకటేశ్వర ఫిష్ ఫార్మ్స్ లో తెల్ల చేపలలో వచ్చే వివిధ రోగాల గురించి క్షేత్రస్థాయిలో మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మత్స్య పరిశోధన స్థానం పాలేరు ఖమ్మం జిల్లాలో మత్స్య రైతులు పాలేరు మత్స్య పరిశోధన స్థానంలో ఉన్న బయో ఫ్లాక్ టెక్నాలజీ, కోళ్లు, చేపల పెంపకం, తెల్ల చేప పిల్లల తయారీ కేంద్రం గూర్చి, రంగు చేపల గురించి, ఆక్వాపోనిక్స్ సిస్టం గురించి మత్స్య పరిశోధన స్థానం పాలేరు శాస్త్రవేత్తలు రైతులకు సంక్షి ప్తంగా వివరించారు.

## పలు సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం



*తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త*

మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న పరిశుభ్రత, దోమల నివారణ, వీధి లైట్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణం తదితర సమస్యలపై స్థానిక తహశీల్దార్‌కు సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో తల్లాడ బిజేపి మండల అధ్యక్షుడు చల్లా నాగులు ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంగీతం సాయిచంద్, చౌడా నాగేశ్వరరావు, వాడవల్లి నాగేశ్వరరావు, బెల్లంకొండ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది బాల పురస్కారం అందుకున్న లిఖిత సాయిశ్రీ



*తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త*

భరత నాట్యంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, లీలావతి మనుమరాలు చిన్నారి లిఖిత సాయిశ్రీ ఉత్తమ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో శ్రీ విశ్వవాసు నామ సంవత్సరం సందర్భంగా ఉగాది బాల పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చిన్నారి లిఖిత సాయిశ్రీ భరతనాట్యంలో అత్యంత ప్రతిభ కనబరచి అవార్డును సొంతం చేసుకుంది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా ఉగాది బాల పురస్కార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భరతనాట్య గురువు కనతాల ఫణి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ జలాలు అందించి పంటలను కాపాడాలి



*తల్లాడ, మార్చి 17, ప్రభాతవార్త*

సాగర్ జలాలు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్పి డిఈకి వినతిపత్రం అందజేశారు. వారాబంధి లేకుండా కంటిన్యూగా నీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, భవాని, పులి వెంకట నర్సయ్య, ఎం. కృష్ణయ్య, ఎస్. వెంకట నరసయ్య, పులి నాగేశ్వరరావు, కె. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.